AL - HILAL

నెలవంక

మాస పత్రిక

Vol 7, Issue: 58 AUGUST - 2011 مجلة الهلال (باللغة التلغوية) – ملحق مجلة البشرى

నరక మోక్షం

క్షమాభిక్ష

కారుణ్యం



IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية



సేవకుడే నాయకుడు



1857 - ముస్లింలు



ఇస్లాం సేవా దృక్పథం

ఉపవాసంలోని మర్మం

“ఓ విశ్వసించిన ప్రజలారా! ఉపవాసాలుండటం మీపై విధిగా నిర్ణయించబడింది-మీ పూర్వీకులపై కూడా ఇదే విధంగా ఉపవాసం విధించబడింది. దీనివల్ల మీలో భయభక్తులు పెంపొందే అవకాశం ఉంది”. (అల్ బఖరా: 183)



ఉపవాసం మనిషిలో దైవభీతిని, ధర్మపరాయణ తను పెంపొందిస్తుంది. అతన్ని దైవ ప్రియునిగా, ప్రజా శ్రేయోభిలాషిగా తీర్చి దిద్దుతుంది.



ఉపవాసం మనిషికి మనో నిగ్రాహాన్ని , ఉత్తమ శీలాన్ని ప్రసాదిస్తుంది. దైవ ప్రవక్త (స) ఇలా హితోపదేశం చేశారు: “ఓ యువకుల్లారా! మీలో మహర్ సొమ్ము చెల్లించగల స్తోమత లేనివారు ఉపవాసం పాటించాలి. అది అతని కొరకు డాలులాగా పని చేస్తుంది”.



ఉపవాసం శరీరంలోని అన్నవాహికను, ధమనులను సంకోచింపజేస్తుంది. ఇవి షైతాన్ ప్రసార మార్గాలుగా ప్రసిద్ధం. ఉపవాసం ఈ మార్గాల్లో షైతాన్ దౌష్ట్యాలను అరికడుతుంది.



ఉపవాసం అవాంఛనీయమైన లైంగిక కోర్కెలను, ఆలోచనలను, అవిధేయతా ప్రోత్సాహకాలను నియంత్రిస్తుంది. ఆత్మ భారాన్ని తగ్గించి అందులో చురుకుదనం తీసుకు వస్తుంది.



ఉపవాసం మనిషిని ఇతరుల గురించి ఆలోచించేలా చేస్తుంది. ఉపవాసి తన చుట్టూ బ్రతికే నిరుపేదలనూ, అవసరార్థులను గుర్తించి చేతనైనంత సహాయం చేసేలా అతన్ని పురిగొల్పుతుంది.



ఉపవాసం వల్ల ఆత్మకు బలమైన శిక్షణ లభిస్తుంది. హృదయం పరిశుద్ధం అవుతుంది. చూపులకు బిడియం అలవడుతుంది. అవయవాలు సురక్షితమవుతాయి.



ఉపవాసం దాసునికి-అల్లాహ్‌కు మధ్య నర్మగర్భంగా ఉండే ఒక రహస్య ఒప్పందం. ఈ కారణంగానే ఉపవాస ప్రతిఫలాన్ని స్వయంగా అల్లాహ్‌యే తన దాసునికి ప్రసాదిస్తాడు.



ఉపవాసం మనిషిని అల్లాహ్ సామీప్యానికి తీసుకు వెళుతుంది. ఉపవాసం ఉండేవారు రయ్యాన్ అనే స్వర్గ ద్వారం గుండా స్వర్గంలో ప్రవేశిస్తారు. ఆ ద్వారం ఉపవాస దీక్షకుల కోసం ప్రత్యేకం.



ఉపవాసం ముస్లింల ఐకమత్యానికి పట్టు గొమ్మలా పరిఢవిల్లుతుంది. ప్రపంచంలోని ముస్లిములంతా ఒకే సమయంలో ఉపవాసం ప్రారంభించి, తిరిగి ఒకే సమయంలో ఉప వాసాన్ని విరమించడం అందుకు ఓ సజీవ సాక్ష్యం.



ఉపవాసం పాపాల్ని కడిగివేస్తుంది. ప్రజల మధ్య సోదర భావాన్ని, సహిష్ణుతను, సౌభ్రాతృత్వాన్ని పెంచుతుంది.



ఉపవాసం దేహ ఆరోగ్యాన్ని పెంచుతుంది. శరీరం నుంచి మలీనాలను విసర్జింపజేస్తుంది. కడుపును సాంత్వన పరుస్తుంది. రక్తాన్ని శుభ్ర పరుస్తుంది. గుండెకు నెమ్మదినిస్తుంది. నడవడికను క్రమబద్ధం చేస్తుంది.



ఉపవాసం మితిమీరిన కోరికల్ని పరిత్యజించేలా, హానికర వస్తువుల్ని విడనాడేలా మనిషిని ప్రేరేపిస్తుంది. అతనిలో, సహనాన్ని, త్యాగ గుణాన్ని నూరి పోస్తుంది.



ఉపవాసం ధర్మ విధులను నిర్వర్తించటానికి కావలసిన నైతిక శక్తిని, బలాన్ని సాధించి పెడుతుంది. అందుకు తగ్గట్టు క్రమశిక్షణను ఇచ్చి అతన్నో గొప్ప విజేతగా మలుస్తుంది.



సామాజిక, సాంస్కృతిక, సందేశాత్మక మాస పత్రిక

నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 7, ISSUE: 58
AUGUST 2011

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Syed Abdus Salam Omeri

ASSOCIATE EDITOR
Sk. Habeebur Rahman Jamaee

EDITORIAL BOARD
Sk. Abdus Salam Omeri
Sk. MOHAMMED SALEEM JAMAEE
Sk. Muhammad Bilal
Tahera Begum

PHONE
Syed Abdus Salam Omeri
97248933

FAX
22400057

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY
IPC
Islam Presentation Committee
Kuwait
www.ipc.org.kw

DESIGN
Nader Belal

مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency
www.zukhruf.net
Tel. 99993072

ఈ సంచికలో....



మహిమాన్విత గ్రంథం ఖుర్‌ఆన్



మీ సొత్తు మీ పరం



సంస్కరణ అంచెలవారీగా జరగాలి



ఎందుకనీ....?

మన గొంతులు జాతీయ గీతాలు ఆలపిస్తున్నై మన మనసులు మాత్రం దేశం గురించి ఆలోచించవు ఎందుకని? మన జెండాకు ఇచ్చే గౌరవం మనం సాటి ప్రజలకు ఇవ్వం ఎందుకని? మన దేశ పటం పట్ల కనబర్చే అభిమానం మనం దేశ ప్రయోజనాల పట్ల కనబర్చం ఎందుకని.....? స్వాతంత్ర్య దినోత్సవ శుభ కాంక్షలు అందుకుంటూనే ఆలోచించండి....!!!

సేవకుడే నాయకుడు	2
1857 – ముస్లింలు	3
ఇస్లాం సేవా దృక్పథం	4
మహిమాన్విత గ్రంథం ఖుర్‌ఆన్	6
హజ్రత్ సుమా బిన్ అసాల్ (ర)	8
మీ సొత్తు మీ పరం	9
సంస్కరణ అంచెలవారీగా...	10
ధర్మ సందేహాలు	11
ఇస్లాం శిక్షణ	12
కవితా కుసుమాలు	13
సర్వేంద్రియానం నయనం ప్రధానం	14
పూ పరిమళం	15
జ్ఞానామృతం	16
ఐపిసి వార్తలు	18
నేటి బాలలే రేపటి పౌరులు	19
ఖుర్‌ఆన్ కంఠస్థ పోటీలు	20
రమజాన్ పోటీలు	22

حكمة الصيام - سيد القوم خادمهم (كلمة العدد) - دور المسلمين في استقلال الهند - خدمة الخلق والإسلام - رسالة القرآن إلى الإنسان - الصحابي الجليل ثمامة بن اثال (رضي الله عنه) - هذه أمانتكم إليكم - حكمة التدرج في التربية - الفتاوى الشرعية - الأمور الضرورية في حياة المسلم (تربية المهتدين) - نشيد عن صبر الأنبياء عليهم السلام - عجائب قدرة الله في العين - اختبر معلوماتك - جوامع الكلم - أخبار اللجنة - روضة الأطفال - مسابقة القرآن - مسابقة ثقافية لغير مسلمين والمهتدين

దృక్పథం

సేవకుడే నాయకుడు



ఉదయం మనం ఇంటి నుండి బయలుదేరినప్పటి నుండి మొదలు సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేంత వరకు ఎందరో మనకు తారస పడుతుంటారు. క్లాస్ రూమ్‌లో, ఆఫీసులో, కార్యాలయంలో, బస్సులో, ట్రైనులో, పొలంలో, తోటలో, హోటల్లో–అనేక చోట్ల నామకులు–అనామకులు, మిత్రులు–శత్రువులు, పండితులు–పామరులు, ధర్మాత్ములు–దురాత్ములు, పేదవారు–ధనికులు, ఉపాధ్యాయులు–విద్యార్థులు, అనాథలు–ఆపద్బాంధవులు, యజమానులు–కార్మికులు, బోధగురువులు–బాధగురువులు, స్వదేశీయులు–పరదేశీయులు, వర్తకులు–కొనుగోలుదారులు, వైద్యులు–రోగులు, సన్యాసులు–సామాన్యులు ఇలా ఎందరో! తీరా సాయంత్రం ఇంటికి చేరుకుంటాము. ఇంట్లో తల్లిదండ్రులు, అన్నాచెల్లెళ్ళు, భార్యాపిల్లలు, బంధువుమిత్రులు, నౌకరులు, పెంపుడు జంతువులు, మొక్కలు–ఇలా మనం ఎవరెవర్ని కలుసుకుంటామో వారిలో ప్రతి ఒక్కరూ మన సేవకు అర్హులే. కనిపించిన ప్రతి మొక్కకు నీరు పోయాలి. ప్రతి వ్యక్తిని పలుకరించాలి. ప్రతి జీవిని ప్రేమించాలి. ఎందుకంటే, మళ్ళీ ఈ దారిన ప్రయాణించే అదృష్టం మనకు లభించకపోవచ్చు.

"స్వయం కోసం దేన్నయితే ఇష్టపడతామో మన సోదరుని కోసమూ దాన్నే ఇష్టపడాలి" అని మహా ప్రవక్త ముహమ్మద్ (స) చెప్పారు. అవును; మనల్ని మనం ప్రేమించినట్లే ఎదుటి వారిని ప్రేమించాలి. ఈ సువిశాల ప్రపంచంలో మనం తలుచుకుంటే అందరూ అయినవాళ్లే, కానివాళ్ళంటూ ఎవరూ ఉండరు. వారిని మంచి చేసేందుకు ఓ మంచి మనసు కావాలి మనకు. మన ఒక్క ఆదరణ నూరేళ్ళ జీవితాన్ని తీర్చిదిద్దుతుంది. తీయని ఓ మాట నిండు హృదయాన్ని నింపుతుంది. నిత్యం మనం ఎవరో ఒకరిని చేతనైనంత సహాయం చేస్తూండాలి. మన సహాయం అందుకున్నా వ్యక్తి ముఖంపై గోచరించే ఆనందం మనకు ఆత్మానందాన్ని ఇస్తుంది. మనారోగ్యాన్ని, ఆయుష్షును పెంచుతుంది. **'మీ రోగులకు దానధర్మాల ద్వారా స్వస్థతను చేకూర్చండి'** అని పవక్త (స) చెప్పింది ఇందుకేనేమో! సహాయం చేసే చేతులు ప్రార్థించే పెదవులకన్నా గొప్పవన్న యదార్థాన్ని గుర్తుంచుకోవాలి మనం. దైవ ప్రవక్త (స) ఇలా ఉద్బోధించారు: **"ఒక విశ్వాసి అవసరాన్ని తీర్చడం కోసం అతనితోపాటు నడవడం, మస్జిద్‌లో 2 నెలలపాటు ఏతికాఫ్ కోసం కూర్చోవడంకన్నా నాకెంతో ఇష్టమైనది"** (సహీహ్ జామె సగీర్)

నిజం–, అగత్యపరుల అగచాట్లను జాలి గుండెతో అర్థం చేసుకున్నప్పుడే మనకు తృప్తి కలుగుతుంది. అప్పుడు ప్రస్తుతం మనకు ప్రాప్తమయి ఉన్న వరాలకుగాను అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకోవాలనిపిస్తుది. ఇంకో మంచి పని చేయాలని మన మనస్సుకు శరీరానికి ఉత్సాహం వస్తుంది. కన్నవారితో కనికరంతో మెలగకుండా, ఒక విధవరాలి కన్నీరు తుడవకుండా, ఆకలితో అలమటిస్తున్న ఒక అగత్యపరుని ఆకలి తీర్చకుండా, ఒక అనాథను అక్కున చేర్చుకోకుండా ఎంత ధర్మాన్ని పాటించినా, మరెన్ని ఆస్తిపాస్తులతో జీవించినా ఆ బ్రతుకుకి అర్థపర్థం ఉండదనే చెప్పాలి. అందుకే **"తాను తనివితీరా భోంచేసి కనీసం పొరుగువాని ఆకలి బాధను సయితం పట్టించుకోని వ్యక్తి సంపూర్ణ విశ్వాసి కాజాలడు"** అని మానవ మహోపకారి ముహమ్మద్ (స) హెచ్చరించారు. ఇది నిజం – కఠోర సత్యం! ఒక బాధాతప్త హృదిని ఓదార్చడంలో, ఒక అవసరార్థుడ్ని ఆదుకోవడంలో, ఒక బాటసారి అవసరం తీర్చడంలో, ఒక అనాథకి ఆశ్రయం ఇవ్వడంలో, ఇతరుల కష్టాల్లో పాలు పంచుకోవడంలో అల్లాహ్‌ను, అల్లాహ్ అనుగ్రహాన్ని చూసేవాడు భక్తుల్లో అగ్ర భాగంలో ఉంటాడు. ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది: **"తాము అమిత అవసరంలో ఉన్నప్పటకీ తమపై వారికే ప్రధాన్యతనిస్తారు. వాస్తవానికి తన స్వార్థప్రియత్వం (పేరాశ) నుండి రక్షించబడినవారే కృతార్థులు".** (అల్ హష్ర్: 9) మహనీయ ముహమ్మద్ (స) వారు తమ సముదాయాన్ని జాగరూకపర్చిన విధానం కూడా కాస్త గమనించండి: **"మీరు స్వార్థప్రియత్వం, ఆత్మ లోభత్వం నుండి మిమ్మల్ని కాపాడుకోండి. ఈ ఆత్మ లోభత్వమే (అత్యాశే) పూర్వీకులను పొట్టన బెట్టుకుంది. ఈ మనో వ్యాధియే వారిని రక్త పిపాసులుగా మార్చింది. ఫలితంగా వారు అధర్మమైన వాటిని ధర్మసమ్మతం చేసుకునే నీచ స్థాయికి దిగజారారు".** (సహీహ్ ముస్లిం)

ఇస్లాం, మనిషికిచ్చే శిక్షణలో, చేసే బోధనలో – **'సేవకుడే నాయకుడు'** అని ఓ చోట అంటే, **'రథసారధి తన అనుయాయుల్ని మోసగించడు, వారితో అబద్ధమాడడు'** అని మరో చోట అంటుంది. **'అసూయపరుడు నాయకత్వానికి అనర్హుడు'** అని ఓ చోట సెలవిస్తే, **'క్షమ, దయ, మన్నింపుల వైఖరి గలవాడే నిజమైన నాయకుడు'** అని మరో చోట వక్కాణిస్తుంది. **'కల్మషం, కల్లాకపటం, స్వార్థం గలవాడు రథసారధి కాలేడు'** అని ఓ చోట చెబితే, **'మృదువు స్వభావుడు, నిర్మల హృదయుడే నికార్సయిన నాయకుడు'** అని మరో చోట చెబుతుంది. అది చేసే హితవుల్లో ప్రథమమయినది – **'(అద్దీను అన్నసీహా) జన హితమే దైవ అభిమతమన్నది'.** అది విధి చేసే ఉపవాస దీక్ష సయితం దీన్ని ఉద్దేశించనదే. అంటే రమజాను మాసం మనిషి, మహా మనీషిగా, మహా నాయకుడిగా ఎదిగే సువర్ణావకాశం అన్న మాట. ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగ పర్చుకుంటారని ఆశిస్తూ..... రమజాను శుభాకాంక్షలు తెలియజేస్తున్నందుకు సంతోషిస్తున్నాము.

సయ్యద్ నశీర్ అహ్మద్



1857 - ముస్లింలు

1857 నాటి ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం భారత దేశ చరిత్రలో మహోజ్వల ఘట్టం. భారతీయుల పోరాట పటిమకూ, శౌర్య ప్రతాపాలకూ, నిరుపమాన దేశాభిమానానికి నిలువుటద్దం. ఈ పోరాటంలో, (ప్రస్తుతం) భారత దేశపు అతి పెద్ద అల్ప సంఖ్యాక వర్గమైన ముస్లిం సమాజం అద్భుతమైన భాగస్వామ్యాన్ని అందిస్తూ ముందుకు సాగింది. ఈ పోరులో అగ్రభాగాన నిలచి ఆదర్శవంతమైన పాత్రను నిర్వహించి ఇతర జన సముదాయాలకు తలమానికమయ్యింది. ముస్లిమేతర సాంఘిక జన సమూహాలతో మమేకమై, పరాయి పాలనకు వ్యతిరేకంగా ఉవ్వెత్తున సాగిన సమరంలో నాయకత్వ పాత్రను చేపట్టి తన విద్యుక్త ధర్మాన్ని అపూర్వ రీతిలో నిర్వర్తించింది.

ఈ పోరాటంలో అపూర్వ త్యాగాలతో, అసమాన బలిదానాలతో ముస్లింలు పునీతులయ్యారు. ఆడ-మగ, బాలుడు-వృద్ధుడు తేడా లేకుండా సమర శీల పాత్ర నిర్వహిస్తూ, ఎక్కడా రాజీ పడకుండా తమ ప్రాణాలను పణంగా పెట్టి స్వదేశం నుండి వలస పాలకులను తరిమి కొట్టాలన్న దృఢ సంకల్పంతో అనిర్వచనీయమైన త్యాగాలతో చరిత్ర సృష్టించారు. చివరకు ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం ఇస్లామిక్ కుట్ర అని ఆంగ్లేయులు భావించినంతటి ప్రధాన పాత్రను పోషించారు.

ఈ సందర్భంగా భారతావనిలోని ప్రధాన సాంఘిక జన సముదాయాలైన హిందూ-ముస్లింల మధ్య పటిష్టమైన సమైక్యత వ్యక్తమైంది. ఈ ఐక్యతను గమనించిన బ్రిటీష్ పాలకులు కలవర పడ్డారు. ఈ ఐక్యత తమ అధికార ప్రాభవ వైభవాలకు గొడ్డలి పెట్టు కాగలదని భయపడిన ఆంగ్లేయులు **విభజించి-పాలించు** అన్న కుటిల నీతిని అమలు పర్చి, చరిత్రను వక్రీకరణలకు గురి చేసి, పలు కుయుక్తులకు పాల్పడి మొత్తం మీద భారతీయులను మతం పేరుతో మానసికంగా హిందువులు-ముస్లింలుగా విభజించటంలో కృతకృతులయ్యారు.

ఈ ప్రయత్నాలలో భాగంగా ముస్లింల మీద అసత్య ప్రచారాలను అంబారాన్ని అంటే దాక కొనసాగించారు. ఆ ప్రచారాలకు అక్షర రూపం కల్పించి నిక్షిప్తం చేసి స్థిరపర్చారు. ఆ ప్రవాహంలో స్వదేశీ చరిత్రకారులు కొట్టుకు పోయారు. చివరకు ఆంగ్లేయుల కుట్ర ఫలించి ఇండియా విభజన వరకు సాగింది. ఈ విధంగా విభజనకు దారి తీసిన పరిస్థితులు, ఆ సందర్భంగా జరిగిన దారుణాలు, పొరుగు దేశంగా ఏర్పడిన పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధాలు, తదుపరి ఏర్పడి ఉద్రిక్త పరిస్థితులు అలనాటి ఐక్యతకు తూట్లు పొడిచి విభిన్న జన శ్రేణులలో పరస్పరం ఉన్న సద్భావనకు చిచ్చుపెట్టాయి.

ముస్లిం సమాజం మీద మోపబడిన విభజన అను రుజువుకాని కాలేని, నేరం సృష్టించిన ప్రత్యేక మానసిక పరిస్థితి చరిత్రకారులను, రచయితలను కూడా తాకింది. భారత విభజనానంతర పరిణామాల వలన అపరాధ భావనకు గురి చేయబడిన ముస్లిం సమాజం సుషుప్తావస్థలోకి నిష్క్రమించింది. ఆ కారణంగా విశృంఖలంగా ప్రచారమౌతున్న అపోహలను-అసత్యాలను ఆ దిశగా సాగుతున్న అనుచిత చర్యలను ముస్లిం సమాజం వాస్తవాలతో బలంగా తిప్పికొట్టలేక పోయింది. ముస్లిమేతర సమాజానికి తమ పూర్వీకుల మహత్తర త్యాగమయ పాత్రను వివరించలేక పోయింది.

చరిత్రకారులు, పరిశోధకులు కూడా అసత్యాల జడివానలో కునారిల్లుతున్న ముస్లింలకు సంబంధించిన నిజానిజాలను నిర్ధారించి ప్రజలకు వాస్తవాలు అందించలేక పోయారు. అలనాడు తమ స్వార్థం కోసం వలసవాద చరిత్రకారులు సృష్టించిన ముస్లిం వ్యతిరేక చరిత్ర అక్షర రూపంలో స్థిరపడినందున ఆ ప్రభావం నుండి స్వదేశీ చరిత్రకారులు కూడా బయటపడలేక పోయారు. అందు వలన ముస్లిం యోధుల త్యాగ చరిత్రలు అక్షర రూపంలో నిక్షిప్తం కాలేక పోయాయి.

ప్రజలకు చేరువ కాని సమచారం

అందువలన సాధారణ చరిత్ర గ్రంథాలలో త్యాగధనులైన ముస్లింలు చాలా వరకు కన్పించరు. ఒకరిద్దరు కన్పించినా అనన్య సామాన్యమైన వారి సాహసం, త్యాగాలు, అతి సాధారణ స్థాయి వివరణలతో, వర్ణనలతో సరిపెట్ట బడ్డాయి. బహుళ ప్రాచుర్యంలో ఉన్న పాపులర్ చరిత్ర గ్రంథాలలో ముస్లింల విరోచిత గాథలు సరైన స్థానం పొందలేకపోయాయి. ఆయా కథనాలు ప్రాంతీయ గ్రంథాలలోగానీ, పాఠ్య పుస్తకాలలోగాని సక్రమంగా చోటు చేసుకోలేదు. ఫలితంగా భవిష్యత్తు తరాలకు అలనాటి అమూల్య సమాచారం అందకుండా పోయింది.

సామాన్య చరిత్ర గ్రంథాల ద్వారా తేలిగ్గా సమాచారం లభించే అవకాశం లేనందున, కళారూపాలకు, సాహిత్య ప్రక్రియలకు, ప్రచార మాధ్యమాలకు ముస్లింల శ్లాఘనీయ చరిత్రలు కథా వస్తువులు కాలేకపోయాయి. ఆ కారణంగా ముస్లింల త్యాగాలు, అనాటి విరోచిత పోరాట ఘట్టాలకు మన సాహిత్యంలో సరైన స్థానం లభించలేదు. కళా-సాహిత్య మాధ్యమాల ద్వారా జన బాహుళ్యంలోకి వారి త్యాగాలు ప్రసరించక పోవటం వలన ఆ తరువాతి తరాలకు ఆయా చారిత్రక విషయాలు తగినంతగా పరిచయం కాలేదు.

అపూర్వ త్యాగాల చరిత్ర అందరికి తెలియాలి

ఈ అవాంఛనీయ పరిస్థితి చక్కదిద్దాల్సిన అవసరం ఎంతో ఉంది. భారత దేశంలోని అన్ని సాంఘిక జన సముదాయాల త్యాగాలు ప్రతి ఒక్క సముదాయానికి తెలియాల్సి ఉంది. బహుళ సంస్కృతీ సభ్యతలతో విలసిల్లుతున్న పలు సాంఘిక జన సముదాయాల గడ్డ అయినటువంటి ఇండియాలోని జన సముదాయాల మధ్య సుహృద్భావ వాతావరణం ఏర్పడటానికి చరిత్రలో ఆయా సముదాయాలు నిర్వహించిన పాత్ర ఆ ప్రత్యేక సమూహానికి మాత్రమే కాకుండా ఇతర సముదాయాలకు కూడా తెలియాల్సిన అవసరం చాలా ఉంది.

ఆ వాతావరణం భిన్న సముదాయాల మధ్య సదవగాహన, సద్భావన, సహిష్ణుతకు పునాది అవుతుంది. ఈ వాతావరణంలో మాత్రమే లౌకిక వ్యవస్థ పరిఢవిల్లుతుంది. ఈ సానుకూల మానసిక స్థితిలో మత విద్వేషాలు మట్టిలో కలిసి శాంతి-సామరస్యం మరింతగా పటిష్టమవుతుంది. శాంతి-సామరస్యాలతో విలసిల్లుతున్న సమాజంగాని, దేశంగాని నిరాటంకంగా అభ్యున్నతి దిశగా సాగిపోతుంది.

- మౌలానా సయ్యిద్ జలాలుద్దీన్ ఉమ్రీ
జమాతె ఇస్లామీ హింద్ అధ్యక్షులు)



ఇస్లాం సేవా దృక్పథం

ఇస్లాం ధర్మం విశ్వాసాల (అఖాయిద్) మీద, ఆరాధనల (ఇబాదాత్) మీద ఎక్కువ నొక్కు పెడుతుంది. ఎందుకంటే, మనిషి విశ్వాసం సరైనదై ఉండి, ఆరాధనల ద్వారా దైవంతో తన సంబంధాన్ని బలపర్చుకుంటే ఆటోమెటిక్‌గా అతని ఆలోచన, ఆచరణ దిశ సయితంసవ్వమైన దిశలో పయనిస్తుంది. అతని జీవితం రుజుమార్గానికి నిలువుటద్దం అవుతుంది. విశ్వాసాలు, ఆరాధనల తర్వాత ఇస్లాం నైతికత మరియు శాసనాలకి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చింది. అది ఉన్నత నైతిక విలువలను బోధించింది. అది మనిషి కీర్తిప్రతిష్టల్ని, గౌరవమర్యాదల్ని ఉన్నత నైతిక ప్రమాణాలతో, ప్రవర్తనతో జోడిస్తుంది. అనైతికత, అశ్లీలత, అసభ్య ప్రవర్తన నుండి దూరంగా మసలుకోవాలని తాకీదు చేస్తుంది. యదార్థమేమిటంటే, నైతిక పతనావస్థ అన్నది మనిషిని అటు ప్రభువు ప్రసన్నతకు, ఇటు ప్రజల ప్రేమకు దూరం చేస్తుంది. ఉత్తమ నైతిక ప్రమాణాల్ని పాటించడం ఒక్కటే మార్గం. అది వినా మార్గాంతరం లేదు. ఉన్నత నైతిక విలువల్లోని స్పష్టమైన కోణం సృష్టిరాసుల సేవ అన్నది. సృష్టిరాసుల సేవ అంటే, ముఖ్యంగా ప్రజల కష్టదుఖాల్లో, క్లిష్టతర ఘడియల్లో పాలుపంచుకోవడం. సేవా భావం సాటి ప్రజల యోగక్షేమాల్ని తెలుసుకునేలా మనిషిని ప్రేరేపిస్తుంది. తద్వారా అతనికి శాంతి, మనఃసంతృప్తి ప్రాప్తమవుతుంది.

ఇస్లాం ప్రారంభం నుంచే దౌర్జన్యం, దుర్మార్గం, దాష్టికానికి, దమన నీతికి, పశువు ప్రవృత్తికి వ్యతిరేకంగా గళం విప్పింది. బలహీన ప్రజల, బడుగు వర్గాల, దళిత జనాల పక్షం వహించి ఎవరి హక్కులు వారికి అందే వాతావరణాన్ని కల్పించింది. ఎక్కడానూ, ఎప్పుడూను వారి హక్కులు స్వాహా కాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంది. సర్వకాల సర్వావస్థల్లోను వారి హక్కులు వారికి అందేలా కట్టుదిట్టమైన చర్యలు, చట్టాలు ప్రవేశ పెట్టి, అందరూ ఆ శాసనానికి లోబడి ఉండేలా ప్రజల్ని తీర్చిదిద్దింది.

నేడు మానవ సేవ అనగానే క్రిస్టియన్ మిషనరీల భావం మెదడులో కదలాడుతుంది. నిజంగా ఇస్లాం ఈ విషయమై ఎంతో మహోన్నత సేవాభావాన్ని ప్రతిపాదించింది. అది వ్యక్తిని, సమాజాన్ని, రాజ్యాన్ని ఇందులో భాగస్వాములను చేసింది. మానవ సేవా విషయమై అది ఎంత విస్తృతంగా చర్చించిందో, ఎలాంటి ప్రణాళికలను, శాసనాలను ప్రవేశపెట్టిందో అవి అద్వితీయమైనవి, అమోఘమైనవీను అనడంలో ఎలాటి సంశయం లేదు. ఇస్లాం బోధించే విలువల వెలుగులో మానవ సేవా దృక్కోణాలు ఏవైతే ముందుకు వస్తాయో అవి –

1 సేవ మానవ ప్రకృతి సిద్ధమైన భావం. ఒక పసికందుని సేవ తల్లిదండ్రులు, బంధుమిత్రులు ఈ సహజ భావం కారణంగానే చేస్తారు. దైవంతో దాసుని సంబంధం ఈ సహజ భావాన్ని బలపరుస్తుంది.

2 ప్రతి యుగంలోనూ దైవ ప్రవక్తలు, దైవ గ్రంథాలు సృష్టి సేవ గురించి ఆదేశించారు. ఈ విషయమై చిట్టచివరి దైవ గ్రంథం ఖుర్‌ఆన్ మరియు కట్టకడపటి దైవ ప్రవక్త ముహమ్మద్ (స) ప్రత్యేకంగా నొక్కి వక్కాణించారు. సమాజంలో సేవా భావాన్ని పెంపొందించడమే కాక, దాన్ని దైవ సామీప్యాన్ని పొందే అతి పెద్ద సాధనంగా అభివర్ణించారు.

3 ఇస్లాం సృష్టిరాసుల సేవను ఆరాధనగా పరగణిస్తుంది. పవిత్ర ఖుర్‌ఆన్, నమాజు మరియు జకాత్‌ను ఒకే చోట పేర్కొంటుంది. నమాజు ద్వారా మనిషి సంబంధం మాధవునితో డైరెక్ట్‌గా ఏర్పడుతుంది. జకాతు ద్వారా మనిషి బాంధవ్యం తోటి మనుషులతో బలపడుతుంది, ఆ విధంగా ఈ ఉభయ కోణాలూ ప్రధానమైనవే. మరో కోణం ఏమంటే, ధన పరమైన ఆరాధను దేహ పరమైన ఆరాధనకు బదులుగా ఖరారు చేయడం జరిగింది. కొన్ని సందర్భాలలో ఉపవాసానికి బదులు దానాధర్మాలు చేయమంటుంది ఇస్లాం.

4 ఇస్లాం కేవలం తనతో మత పరమైన సంబంధం గలవారి సేవ మాత్రమే చేయమని చెప్పదు. అది సమస్త జీవరాసుల పట్ల సత్సంబంధం , సేవాభావం కలిగి ఉండమని ఆజ్ఞాపిస్తుంది.

5 ఇస్లాం ప్రజల్లో సేవా భావాన్ని ప్రేరేపించడంతో సరిపెట్టుకోదు. వారి సేవకు అర్హులు ఎవరు? వారిలో ప్రథములు ఎవరో కూడా తెలియజేస్తుంది. వారిలో తల్లిదండ్రులు, బంధుమిత్రులు లాంటి రక్త సంబంధీకులు కూడా ఉన్నారు. ఎలాంటి రక్త సంబంధం లేని అనాథలు, అగత్యపరులు, వికలాంగులు, వితంతువులు, ఇరుగు పొరుగువారు, బాటసారులు, బానిసలు, ఖైదీలు, అవసరార్థులు కూడా ఉన్నారు.

6 మనిషి అధిక శాతం అవసరాలు ధనంతోనే ముడిపడి ఉంటాయన్నది వాస్తవం. కాబట్టి ధన సేవ ప్రాముఖ్యతను నిరాకరించలేము. అయితే సేవ చేయడానికి ఇదొక్కటే మార్గం అనుకోవడం సరి కాదు. పవక్త (స) వారి ప్రవచనాల దృష్ట్యా - తన సోదరునితో నగుమోము సంభాషణ, సవారీపై కూర్చోవడంలో సహాయం చేయడం, ఏదైనా సామాను ఉంటే ఎత్తి ఇవ్వడం, దారి నుండి హానికర వస్తువును తొలగించడం, దారి తెలియని వ్యక్తికి దారి చూపడం, ఒకరికి గిన్నెలో నీరు నింపి ఇవ్వడం, మంచిని ఆదేశించడం, చెడును వారించడం మొదలైనవన్నీ ధాన ధర్మాల క్రిందికే, సేవ క్రిందికే వస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే 'ప్రతి మంచి కార్యం పుణ్యాన్నిస్తుంది, దానధర్మంగానే పరగణించబడుతుంది.



7 తాత్కాలికమైనది, తక్షణమైనది రెండు రకాల సేవ ఉంటుంది. ఉదాహరణకు- ఆకలిగొన్న వారికి అన్నదానం చేయడం, దప్పి గొంతుల దాహాన్ని తీర్చడం, కూడు లేని వారికి కూడు, గూడు లేని వారికి గూడు, గుడ్డలేని వారికి గుడ్డ సమకూర్చి ఇవ్వడం, రోగుల్ని వెళ్ళి పరామర్శించడం, వారిని అవసరమైన వైద్య సదుపాయాల్ని కలుగజేయడం మొదలైనవి. కొన్ని సందర్భాల్లోనయితే ఈ తాత్కాలిక, తక్షణ సేవ ప్రాముఖ్య మరింత అధికమైపోతుంది. అలాంటి విపత్కర సమయంలో నిర్ల క్ష్యం, సామాజిక స్పృహ లేమి అన్నది ఆ వ్యక్తిలోని నైతిక పతనావస్థకు తార్కాణం. ఇలాంటి సమ యాల్లో ప్రతి ఒక్కరూ స్పందించి తమవంతుగా సేవ అందించాలని ఇస్లాం వక్కాణిస్తుంది.

9 సేవ అనేక రకాలుగా చేయవచ్చు. ధన పరమైన సహాయం అదిం చడం, అప్పు ఇవ్వడం, అప్పు తీర్చే స్థితిలో ఆ వ్యక్తి లేకపోతే గడువు ఇవ్వడం, ఒక వస్తువును శాశ్వతంగా ఇచ్చివేయడం లేదా తాత్కాలి కంగానైనా ఇవ్వడం, అవసరం వచ్చినప్పుడు ఒకేలాంటి రెండు వస్తు వులు - సేద్యం కోసం రెండు ఎద్దులు, పాలు కోసం రెండు ఆవులు ఇవ్వడం, ఒకరితో కూలి కోసం పని చేయించుకోవడానికి బదులు బిజినెస్ పాట్నర్‌గా పెట్టుకోవడం, పాలంలో. పంటలో భాగస్వా మ్యం కల్పించటం, బాధిత ప్రజలను ఆర్థికంగా, నైతికంగా, రాజ కీయంగానూ ఆదుకోవడం మొదలైనవి ప్రవక్త (స) వారి హదీసుల ద్వారా రూఢి అవుతాయి.

11 ఇస్లాం - సృష్టిరాసుల సేవ కోసం ఏకమవ్వాల్సిందిగా, సంస్థలు, ట్రస్టులు లాంటివి ఏర్పాటు చేయవలసిందిగా పురమాయిస్తుంది. ఈ నిమిత్తం ఎవరి సహాయం తీసుకోవడంలో ఎలాంటి అభ్యంత రం లేదంటుంది.

13 కొన్ని మతాలు అవలంబించిన రీతి రివాజుల మూలంగా మాన వులు ధనికులు, పేదలు అన్న రెండు వర్గాలుగా వేరై పోయారు. కొన్ని మత వర్గాలైతే బిక్షాటనను తన వృత్తిగా చేసుకొన్నాయి. ఇస్లాం ఈ రీతి రివాజుకు పూర్తి విరుద్ధం. ప్రజల మధ్య ధనిక, పేద అన్న తారతమ్యాన్ని గర్హిస్తుంది. ఉన్నవారు ఉన్నట్టుగా ఎదిగి పోవడం, లేనివారు అట్టడుగున పడి ఉండటాన్ని అది సుతరామూ ఒప్పుకోదు. అలాగే ఒక వర్గం భిక్షాటపై బ్రతికేదిగా, మరో వర్గం ఉప కారం చేసేదిగా ఉండటాన్ని సయితం అది సహించదు. మనిషి అవసరార్థం సాటి మనిషి సహాయాన్ని కోరవచ్చు. కానీ ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా ఆ పరిస్థితి నుండి బైట పడాలి అంటుంది.

14 కొన్ని మతాలు సృష్టిరాసుల సేవనే సర్వస్వం, దాన్నే అసలు ధర్మం గా భావిస్తాయి. అనేకమంది పెద్దల గురించి వారి మతం మానవ సేవ మాత్రమేనని చెప్పడం మనం వింటూనే ఉంటాము. ఇటు వంటి ధోరణిని సంస్కరించాల్సి ఆవశ్యకత ఎంతైనా ఉంది. సృష్టి రాసుల సేవ ఎంతో ప్రాధాన్యమైన అంశం అయినప్పటికి, ఇస్లాం దాన్ని మాత్రమే ధర్మంగా పరగణించదు. దాన్ని ధర్మంలోని ఒక భాగంగా మాత్రమే చూస్తుంది.

8 ఇస్లాం మనిషి ఎదుర్కునే సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపెడుతుంది. ఒక అగత్యపరుని, ఒక వితంతువు అవసరాన్ని తాత్కాలికంగా తీర్చడం కూడా పుణ్యకార్యమే. అయితే వారి పూర్తి పోషణా బాధ్యతను తన భుజాల మీద వేసుకోవడం దివారాత్రులు ప్రార్థన చేయడంతో, ఉపవాసాలు పాటించడంతో సమానం అంటుంది. అలాగే ప్రేమతో ఒక అనాథ తల నిమరడం గొప్ప పుణ్య కార్యమే కాక తద్వారా మనసు మెత్తబడుతుందంటుంది. అయితే అతని పూర్తి పోషణా బాధ్యత, విద్యా బాధ్యత, అతని నైతిక పర్య వేక్షణ స్వర్గంలో మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారి సహచర్యానికి ముఖ్య సాధనం అంటుంది. అదే విధంగా అగత్యపరులను ఆదు కోవడమే కాక, వారి సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఒక కొట్టు తెరిచి ఇవ్వడమో, ఒక పని నేర్పించడమో చేస్తే మరింత మంచి దంటుంది.

10 పర్యావరణ పరిరక్షణా సేవ సయితం ఎంతో విస్తృతమైనది చెప్పాచ్చు. ఇలాంటి సేవా కార్యక్రమాల వల్ల సమాజానికి చాలా పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. ఇటువంటి సేవలు అటు ప్రభుత్వం, ప్రజలు, సంస్థలు-అందరూ చేస్తుంటారు. ఉదాహరణకు- శుచీశుభ్రత, రహదారుల నిర్మాణం, బస్సు సౌక ర్యం, విద్యుత్, నీటి సౌకర్యం, చెట్లు, మొక్కలు నాటడం, అడవుల ను రక్షించడం, బంజరు భూములను సాగుకు అనుకూలంగా తయారు చేయడం, పాఠ శాలలను, ప్రార్థనాలయాలను, అనా థాశ్రమాలను, వైద్య శాలలను నిర్మించడం మొదలైనవి. ఇస్లాం ఇటువంటి సామాజిక కార్యాల వైపు దృష్టి మళ్ళించడమే కాక, వాటి కోసం కొంత ధనాన్ని ప్రత్యేకించాలని ప్రేరేపిస్తుంది. అందు నిమిత్తం అవసరమైన కార్యప్రణాళికను ప్రజలకు ఇస్తుంది.


12 సేవా విషయమై ఇస్లాం ప్రత్యేకత ఏమిటంటే, అది సృష్టిరాసుల సేవకు సంబంధించిన తప్పుడు సిద్ధాంతాల్ని, రాతాలీతుల్ని సంస్క రిస్తుంది. అది చెప్పేదేమిటంటే ఒక మనిషిపై గల ఇంకో మనిషికి సంబంధించి హక్కు విషయంలో ప్రకృతిసిద్ధ క్రమాన్ని పాటించా లంటుంది. ఈ క్రమాన్ని ఫాలో అవ్వడం తప్పనిసరి అంటుంది. ఉదాహరణకు - తలిదండ్రులు, భార్యాపిల్లలు, బంధుమిత్రు హక్కు ఇతరుల హక్కులకన్నా ప్రాధాన్యం గలది. సేవ చేయాలన్న ఉత్సాహ ప్రవాహంలో సమాజపు ఇతర వ్యక్తుల అవసరాల్ని తీర్చి, సొంత తల్లిదండ్రుల, భార్యాపిల్లల, బంధుమిత్రుల హక్కుల్ని గుర్తించకపోవడం ఏ విధంగానూ సమంజసం కాదు అంటుంది. అలాగే కేవలం తనవారి పట్ల శ్రద్ధ వహించి సమాజంలోని ఇతర ప్రజల పట్ల నిర్లక్ష్య వైఖరిని సయితం అది ఎండ గడుతుంది. ఉభ యులతోనూ సమతౌల్యంగా వ్యవహరించాలంటుంది.

15 చివరి మాట ఏమిటంటే, ఇస్లాం దృష్టిలో ఏ సత్కార్యమైతే దైవ ప్రసన్నత, చిత్తశుద్ధి ప్రాతిపదికన చేయబడుతుందో, ఆ సత్కార్యం మాత్రమే ఆమోదముద్రను పొందుతుంది. మరే కార్యం వెనకాల పేరు ప్రతిష్టల కాంక్ష ఉంటుందో, పచ్చి స్వార్థం దాగి ఉంటుందో అట్టి కార్యాన్ని అది ఎంత ఘనతరమైనదైనా అల్లాహ్ దర్బారులో ఆమో దం పొందజాలదు. పైగా అది శిక్షకు కారణం అవుతుంది. సృష్టి రాసుల సేవ ఎంత ముఖ్యమో, చిత్తశుద్ధి, నిస్వార్థం, దైవ ప్రసన్నత కూడా అంతే ముఖ్యం. చిత్తశుద్ధి లేని ఎట్టి కర్మ ద్వారానైనా పుణ్యం, మోక్షాన్ని ఆశించలేము.

('రాహె ఏతిదాల్' సౌజన్యంతో)

మహిమాన్వితే గ్రంథం ఖుర్‌ఆన్

మానవాళికిచ్చే సందేశం



మహిమాన్వితమైన గ్రంథం ఖుర్‌ఆన్ ఒక విప్లవాత్మకమైన కళాఖండం. ఆర్థిక, ఆధ్యాత్మిక, నైతిక, విద్య, వైజ్ఞానిక, రాజకీయ, సామాజిక రంగాల్లో అర్థవంతమైన, శాంతివంతమైన విప్లవాన్ని తీసుకు వచ్చిన మాగ్నాకాటా ఖుర్‌ఆన్. విశ్వం, విశ్వంలోని సమస్తం శాంతిశ్రేయాలతో వర్ధిల్లాలన్నా, సుఖసంతోషాలతో పరిఢవిల్లాలన్నా, మానవ జీవితాల్లో దాని అమృత పలుకుల పరిమళాలు వెల్లివిరియటం ఒక్కటే మార్గం. 'హబ్లుల్లాహిల్ మతీన్' దైవ పటిష్టమైన త్రాడు అయిన ఈ పవిత్ర గ్రంథానికి అనుగుణంగా నడుచుకుంటే ఇహపరాల సాఫల్యాలు మానవుల సొంతమవక మానవు. దాన్ని పారాయణం చెసినకోద్దీ, అర్థం చేసుకున్న కొద్దీ, ఆకళింపు చేసుకొన్న కొద్దీ, ఆచరించిన కొద్దీ మానవ కళాహీన జీవితాల్లో కొత్త కాంతులు ప్రసరిస్తాయి. కలవరం చెందే హృదయాలు అందలి మాధుర్యాన్ని ఆస్వాదించడం ద్వారా కుదుట పడతాయి. దాని నుండి జాలు వారే జ్ఞాన సౌరభాలతో వారి తనువులు పులకించిపోతాయి, వారి మేధ వికాసమొందుతుంది, వారి జీవితాలు పునీతం, నిత్య పావనం అవుతాయి. ఎందుచేతనంటే, ఏ విషయాన్నయినా హృదయానికి హత్తుకునేలా చెప్పడం ఖుర్‌ఆన్ ప్రత్యేకత. దాని శైలి విలక్షణమైనది, అనితర సాధ్యమైనదీనూ. అది స్వర్గవాసుల సుఖసౌఖ్యాలను చిత్రీకరించినా, నరకవాసుల యమ యాతనలను అభివర్ణించినా, వారి వ్యధాభరిత జీవితాన్ని గురించి హెచ్చరించినా, ప్రళయ దినపు దృశ్యాలను ప్రస్తావించినా, ప్రపంచంలో అనునిత్యం తారసపడే దైవ నిదర్శనాలను గూర్చి ప్రస్తుతించినా - అవి మన కళ్ళ ముందు కదలాడుతున్నట్లే ఉంటాయి. అది చెప్పే ప్రతి మాట, చేసే ప్రతి హెచ్చరిక సూటిగా వచ్చి గుండె లోతుల్లోకి చొచ్చుకుపోతుంది. తన బోధన పాఠకులకు ఎల్లకాలం గుర్తుండేలా చేస్తుంది.

అందువల్ల ఖుర్‌ఆన్ గ్రంథాన్ని, దాని బోధనల్ని అధ్యయనం చేయడం, ఆపోశనం పట్టడం మానవతా పరిణతికి అవసరమయిన ముఖ్యాంశం. అది కేవలం అధ్యయనంతో ఆగిపోవలసిన ఉద్యమం కాదు. వ్యక్తి సంసార, సంఘ నిర్మాణ, స్వర్గ సాఫల్య, నరక మోక్ష పథక రూపకల్పన వరకు కొనసాగవలసిన మహా ప్రస్థానం! మనలో ప్రతి ఒక్కరూ ఖుర్‌ఆన్ ఆదేశాల్ని మన వ్యక్తిత్వాల్లో నింపుకొని, అది ప్రతిపాదించిన సూచనల ఆధారంగా మన సమాజాన్ని సంస్కరించుకొని, ప్రవక్త (స) వారి కాలం నాటి ఆదర్శ సమాజమైనటువంటి సత్సమాజాన్ని సాధించుకోవాలి. అందు నిమిత్తం అది మానవాళికిచ్చే ప్రధమ సందేశ సారాంశమే ఈ వ్యాసం. - ఎడిటర్)

అందరిని పుట్టించిన ఆ ఒక్క నిజ దైవాన్నే ఆరాధించండి

"ప్రజలారా! మిమ్మల్ని, మీకు పూర్వం వారినీ పుట్టించిన మీ ప్రభువునే ఆరాధించండి- తద్వారానే మీరు (పాపాల నుండి) సురక్షితంగా ఉంటారు. ఆయనే మీకోసం భూమిని పాన్పుగానూ, ఆకాశాన్ని కప్పుగానూ చేశాడు. ఆకాశం నుంచి వర్షం కురిపించి, తద్వారా పండ్లు ఫలాలను పండించి మీకు ఉపాధినొసగాడు. ఇది తెలిసి కూడా మీరు ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా నిలబెట్టకండి".

(అల్ బఖర: 21, 22)

నిజ ప్రభువు (అల్లాహ్) పుట్టుపూర్వోత్తరాలను, ఆయన వంశపరంపరను గురించి కాస్త వివరించమని బహుదైవారాధకులు మహా ప్రవక్త(స)ను డిమాండు చేసిన నేపథ్యంలో క్రింది సూరా అవతరించింది.

"ఇలా చెప్పెయ్యి, ఆయన అల్లాహ్ అద్వితీయుడు. అల్లాహ్ నిరపేక్షాపరుడు ఎవరి ఆధారమూ, ఎవరి అక్కరా లేనివాడు; అందరూ ఆయనపై ఆధార పడేవారే. ఆయనకు సంతానం ఎవరూ లేరు. ఆయన కూడా ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరిసమానులు ఎవరూ లేరు". (సూరుతుల్ ఇఖ్లాస్)

1-అంటే ఆయనకు ఎవరి అవసరమూ లేదు. ఆయన ఎవరిపైనా ఆధారపడినవాడు కాడు. అందరికీ ఆయన అవసరం ఉంది. అందరూ ఆయన పైనే ఆధారపడి ఉన్నారు. అల్లాహ్ అందరికన్నా వేరైనవాడు, నిరపేక్షాపరుడు.

2- ఆయనకు సంతానం లేదు. ఆయనకు సైతం తల్లిదండ్రులు లేరు. మరి ఆయన కూడా ఎవరినీ కుమారులుగాగానీ, కూతుళ్ళుగా గానీ చేసుకోలేదు.

3- ఆయన ఉనికిలోగానీ, ఆయన గుణగణాలలోగానీ, ఆయన అధికారాలలోగానీ ఆయనకు భాగస్వాములు లేరు. ఆయన్ని పోలిన వారూ లేరు. ఆయనకు సరిజోడీ కూడా లేరు. **"ఆయన లాంటి వస్తువు సృష్టిలో ఏదీ లేదు"** (షూరా-11) ఒక హదీసె ఖుద్సీలో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు:

"మానవుడు నన్ను దూషిస్తున్నాడు. అంటే నాకు సంతానాన్ని ఆపాదిస్తున్నాడు. వాస్తవానికి నేను ఒక్కడినే. నేను నిరపేక్షాపరుణ్ణి. నేనెవరినీ కనలేదు. నేనెవరికీ పుట్టనూ లేదు. నాకు సరిజోడీ కూడా ఎవరూ లేరు."

(సహీహ్ బుఖారీ-ఖుల్‌హు వల్లాహు అహద్ సూరా వ్యాఖ్యానం)

ఈ సూరా ద్వారా బహుదైవారాధకుల మూఢ నమ్మకాలు, అల్లాహ్‌కు కుమారులను ఆపాదించే వారి మిథ్యావాదాలు, దైవానికి భాగస్వాములను కల్పించే వారి కాల్పనిక సిద్ధాంతాలు-అన్నీ నిర్ద్వంద్వంగా ఖండించ బడ్డాయి.

మీకు దేవుని అవసరం ఉంది. అల్లాహ్ అయితే అన్నింటికీ అతీతుడు

"ఓ ప్రజలారా ! మీరంతా అల్లాహ్ అవసరం కలిగినవారు. అల్లాహ్ మాత్రం అక్కరలేనివాడు. (సర్వ విధాలా) స్తుతించదగినవాడు. ఆయన గనక తలిస్తే మిమ్మల్ని తుదముట్టించి, (మీ స్థానంలో) మరో నూతన సృష్టిని చేయగలడు. ఇలా చేయటం అల్లాహ్‌కు ఏమాత్రం కష్టతరం కాదు". (ఫాతిర్:15-17)

1- 'నాస్' అన్న పదం సర్వసాధారణమైనది. అందులో సామాన్య జనులు, ముఖ్యమైన వ్యక్తులు, దైవప్రవక్తలు కూడా చేరి ఉన్నారు. అందరూ అల్లాహ్ పై ఆధార పడినవారే. కాని

అల్లాహ్ మాత్రం ఎవరిపైనా ఆధారపడడు.

2–ఆయన నిరపేక్షాపరుడు, అక్కర లేనివాడు. లోకంలోని జనులంతా ఆయన విధేయతను నిరాకరించినా ఆయన సామ్రాజ్యంలో ఏ లోటూ రాదు. ఒకవేళ అందరూ విధేయులు గా మారిపోయినా ఆయన శక్తియుక్తులలో కలిగే వృద్ధి అంటూ ఏదీ లేదు. అవిధేయతకు ఒడిగట్టినవారు తమ ఆత్మలకే అన్యాయం చేసుకుంటారు. విధేయత చూపి, ఆయన దాస్యం చేసినవారు తమ స్వయానికే మేలు చేకూర్చుకున్నవారవుతారు.

3– ఆయన తన దాసులకు ప్రసాదించిన అనంత అనుగ్రహాల, వరాల మూలంగా దాసుల తరఫున ఆయన స్తుతిస్తోత్రాలకు, కృతజ్ఞతలకు అర్హుడయ్యాడు.

4–ఇది కూడా ఆయన నిరపేక్షా స్వభావానికి ఓ మచ్చు తునకే. ఆయన గనక తలచుకుంటే మిమ్మల్ని ఇట్టే తుడిచి పెట్టేసి, మీకు బదులు గా అనూహ్యంగా ఓ నవ లోకాన్ని ఉనికిలోని కి తీసుకురాగలడు. వారు ఆయనకు విధే యులై ఉంటారు. ఆయన ఆజ్ఞలను జవ దాటని వారై ఉంటారు.

అల్లాహ్‌ను వదలి మరు ఎవరెవరినైతే పూజిస్తున్నారో వారంతా అశక్తులే

“ఓ ప్రజలారా! ఒక ఉపమానం వివరించ బడుతోంది–శ్రద్ధగా వినండి, అల్లాహ్‌ను వదలి మీరు ఎవరెవరినయితే మొరపెట్టు కుంటున్నారో, వారంతా ఏకమైనా ఒక్క ఈగ ను కూడా సృష్టించలేరు. పైగా ఈగ వారి నుంచి ఏదైనా వస్తువును ఎగరేసుకుపోతే వారు దాన్ని కూడా దాని నుండి విడిపించుకో లేరు. అర్థించేవాడూ, అర్థించబడేవాడూ–ఇరు వురూ బలహీనులే. వీళ్ళు అల్లాహ్ స్థాయికి అనుగుణంగా ఆయన గొప్పదనాన్ని గుర్తిం చనే లేదు. అల్లాహ్ మహా శక్తిశాలి, ప్రాబల్యం కలవాడు.” (అల్ హజ్:73–74)

1–బూటకపు దైవాల శక్తి ఏపాటిదో ఇక్కడ తెలుపటం జరిగింది. వారంతా కలసి ఒక ఈగను సృష్టించాలనుకున్నా, ఆ పని చేయ లేరు. అయినప్పటికీ మీరు వారినే పూజిస్తు న్నారా? వారు మీ అక్కరలు తీర్చగలరని నమ్ముతున్నారా? మీ ఆలోచనను ఏమనాలి? ఈ ఆయతును బట్టి అర్థమయ్యేదేమిటంటే ఆ కాలంలో జనులు కేవలం రాతి విగ్రహాలను మాత్రమే గాక బుద్ధీ వివేచనలు గల మాన వులను కూడా ఆరాధ్య దేవుళ్ళుగా చేసు కున్నారు. అంటే దేవుని ఆ సజ్జనులు చని పోయిన తరువాత వారిని దైవానికి భాగ స్వాములుగా చేసుకున్నారు. వారు కేవలం రాతి బొమ్మలను పూజించి ఉన్నట్లయితే, **‘ఒక్క ఈగనయినా సృష్టించలేరన్న’** సవాలు చేయ బడేది కాదు.

2– ఇది వారి అశక్తతను, నిస్సహాయ స్థితిని వ్యక్తపరుస్తోంది. ఈగను సృష్టించటం సుదూర విషయం, ఈగ వారి నుంచి తన్నుకుపోయిన వస్తువును సయితం దాని నోటిలో నుంచి లాక్కోలేరు.

3– అర్థించేవారు అంటే బూటకపు దైవాలను పూజించేవారు. అర్థించబడేవారంటే వారు పూజించే బూటకపు దేవుళ్ళు. ఒక హదీసె ఖుద్‌సీలో బూటకపు దైవాల నిస్సహాయ స్థితి ఈ విధంగా తెలుపబడింది– అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **“నా మాదిరిగా సృష్టించదలిచే వాడికన్నా దుర్మార్గుడు ఎవడుంటాడు? నిజం గానే వాడిలో అంతటి శక్తి ఉంటే వాడు ఒక రేణువును లేక గోధుమ గింజనే సృష్టించి చూపాలి”.** (సహీహ్ బుఖారీ – కితాబుల్లిబాస్)

4– అందుకే వారు నిస్సహాయులైన ఆయన దాసులను ఆయనకు సహవర్తులుగా, భాగ స్వాములుగా నిలబెడుతున్నారు. అల్లాహ్ శక్తి యుక్తులను, ఆయన ఆగ్రహానుగ్రహాలను, ఆయన అసాధారణ ప్రజ్ఞాపాటవాలను వారు సరిగ్గా గ్రహించగలిగితే వారెన్నటికీ దైవత్వం లో భాగస్వామ్యం కల్పించరు.

సత్యాన్ని తెచ్చిన ప్రవక్తను విశ్వసించండి, సన్మార్గం పొందుతారు

“ప్రజలారా! మీ వద్దకు మీ ప్రభువు తరఫు నుంచి ప్రవక్త సత్యం తీసుకు వచ్చాడు. కాబట్టి మీరు విశ్వసించండి. అది మీకే మేలు. ఒకవేళ మీరు గనక తిరస్కరిస్తే ఆకాశాలలో, భూమిలో ఉన్నదంతా అల్లాహ్‌దే (అని తెలుసు కోండి). అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, వివేక వంతుడూను”. (అన్ నిసా : 170)

అంటే మీ తిరస్కార వైఖరి వల్ల అల్లాహ్‌కు వాటిల్లే నష్టం ఏమీ లేదు. దైవప్రవక్త మూసా (అ) తన జాతి ప్రజలనుద్దేశించి ఇలా అన్నారు: **“ఒకవేళ మీరూ, భూమండలంపై నివసించేవారంతా కలసి అవిశ్వాస మార్గాన్ని ఎన్నుకున్నా (అల్లాహ్‌కు కలిగే నష్టం ఏమీ లేదు) అల్లాహ్ ఏ అక్కరా లేనివాడు, స్తుతించ బడినవాడు”.**(ఇబ్రాహీం–8) హదీసే ఖుద్‌సీలో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడని ఉంది– **“ఓ నా దాసులారా! మీలోని తొలి–తుది మాన వులు, జిన్నులంతా కలసి మీలో అందరికన్నా గొప్ప సదాచార సంపన్నుని హృదయం వలే అయిపోయినప్పటికీ దానివల్ల నా రాజ్యాధి కారంలో ఎలాంటి పెరుగుదల ఉండదు. ఒక వేళ మీలోని తొలి–తుది మానవులు, జిన్నా తులంతా కలసి మీలోని పరమ అవిధేయుని హృదయం వలె అయిపోయినప్పటికీ నా రాజ్యాధికారంలో ఏపాటి తరుగుదలారాదు. ఓ నా దాసులారా! ఒకవేళ మీరంతా కలసి ఒక మైదానంలో గుమిగూడి నన్ను అభ్యర్థిం చుకున్నా, మీ అభ్యర్థనలకనుగుణంగా నేను ఒక్కొక్కనికి ఇస్తూ పోయినా నా ఖజానాలో– ఒక సూదిని సముద్రంలో ముంచి బయటికి తీయటం వల్ల సముద్రంలో వచ్చే లోటు ఎంత ఉంటుందో అంతకు మించిన లోటు (నా ఖజానాలో) ఏర్పడదు”**

(సహీహ్ ముస్లిం – కితాబుల్ బిర్)

“ప్రజలారా! మీ వద్దకు మీ ప్రభువు తరఫు నుంచి స్పష్టమైన నిదర్శనం (బుర్‌హాన్) వచ్చే సింది. ఇంకా, మేము మీ వద్దకు స్పష్టమైన జ్యోతిని పంపాము. కాబట్టి, ఎవరు అల్లాహ్ ను విశ్వసించి, ఆయనతో తమ సంబంధాన్ని పటిష్ఠం చేసుకుంటారో వారిని ఆయన తన కారుణ్యంలోకి, అనుగ్రహంలోకి తీసేసు కుంటాడు. వారికి తన వైపుకు తెచ్చే రుజు మార్గం చూపుతాడు”. (అన్ నిసా:174–175)

1– అరబీలో **‘బుర్హాన్’** అని ఉంది. బుర్హాన్ అంటే స్పష్టమైన ఆధారం, నిదర్శనం అని అర్థం. ఈ ఆధారం గనక ఒకసారి వచ్చిన తరువాత ఇక సందేహాలకు, అనుమానాలకు ఏ మాత్రం ఆస్కారం ఉండకూడదు. అందుకే తదుపరి వాక్యంలో దీన్ని జ్యోతిగా అభివర్ణిం చడం జరిగింది.

2– జ్యోతి అంటే ఖుర్‌ఆన్ అన్న మాట! అది కుఫ్ర్, షిర్క్‌ల అంధకారంలో రుజుమార్గంపై పయనించటానికి వెలుగునిస్తుంది. మనిషి కుడిఎడమల అపమార్గాలకు లోను కాకుండా కాపాడుతుంది. అది సూచించే బాటను అను సరించినవారు దైవకటాక్షానికి అర్హత పొందు తారు.

(ఓ ముహమ్మద్!) వారికి చెప్పు: “ఓ ప్రజలారా! నేను భూమ్యాకాశాల సామ్రాజ్యా నికి అధిపతి అయిన అల్లాహ్ తరఫున మీ అందరి వద్దకు పంపబడిన ప్రవక్తను. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆయనే బ్రతికించేవాడు, ఆయనే మరణాన్ని ఇచ్చేవాడు. కనుక అల్లాహ్‌ను విశ్వసిం చండి. సందేశహరుడు, నిరక్షరాసి అయిన ఆయన ప్రవక్తను కూడా విశ్వసించండి– ఆ ప్రవక్త అల్లాహ్‌ను మరియు ఆయన ఆదే శాలను విశ్వసిస్తాడు. అతన్ని అనుసరిం చండి. తద్వారా మీరు సన్మార్గం పొందు తారు.” (అల్‌ఆరాఫ్: 158)

1– ఈ ఆయతు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) వారి దైవదౌత్యం(రిసాలత్) యావత్ ప్రపంచ మానవులందరికీ వర్తిస్తుం దన్న విషయాన్ని, దానిపై ఉంచవల సిన విశ్వాసాన్ని నొక్కి వక్కాణిస్తోంది. **“సమస్త మానవులారా! నేను విశ్వప్రభువు తరపున మీ అందరివైపుకూ ప్రవక్తగా పంప బడ్డాను”** అన్న సత్యాన్ని ప్రకటించమని దేవుడు తన ప్రవక్త(స)కు ఆజ్ఞాపిస్తున్నాడు.

(మిగతాది 17వ పేజీలో)



ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

హిజ్రత్ సుమామా బిన్ అసాల్ (రజి) - 2

'దైవప్రవక్త(స)! తమరి ఆనతి ఉంటే ఉమ్రాకి వెళతాను' అన్నారు. **"ఉమ్రాకి తప్పకుండా వెళ్ళు. అయితే ఇస్లామీయ పద్ధతి ప్రకారమే ఉమ్రా చేయాలి"** దైవప్రవక్త(స) అతనికి ఉమ్రా చేసే పద్ధతిని బోధించారు. సుమామా (ర) సెలవు తీసుకుని మక్కా వైపుకు పయనమయ్యారు. మక్కా చేరుకోగానే హెచ్చు స్వరంతో తల్బియా పఠించసాగారు.

లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్-లబ్బైక్ లాషరీక లక లబ్బైక్-ఇన్నల్ హమ్ద వన్నీమత లక వల్ ముల్క్ లా షరీకలక.

(హాజరయ్యాను దేవా! నేను హాజరయ్యాను. సహవర్తులు లేని ఓ ప్రభువా! నేను హాజరయ్యాను. ప్రశంసలు నీకే శోభిస్తాయి. అనుగ్రహాలన్నీ నీవు ప్రసాదించినవేను. సార్వభౌమత్వం కూడా నీదే. నీకు సాటి ఎవరూ లేరు.)

మక్కా నగరంలో తల్బియా వచనాలు బిగ్గరగా పలుకుతూ ప్రవేశించిన మొట్టమొదటి ముస్లిం కూడా సుమామా బిన్ అసాల్(ర) .

కాబా ప్రాంగణంలో ప్రతిధ్వనించిన ఈ వచనాలను విని ఖురైషులు ఓర్చుకోలేక పోయారు. తమ పౌరుషాన్ని రెచ్చ గొట్టిన ఆ వ్యక్తిని పట్టుకోవటానికి అందరూ కత్తులు కటార్లతో సహా వచ్చి ఆయన్ని చుట్టు ముట్టారు. వాళ్ళను చూసి సుమామా (ర) మరింత బిగ్గరగా లబ్బైక్ పలికారు. అంతే మక్కా వారు తమ ఒరలలో నుంచి ఖడ్గాలు బయటికి తీశారు. ఒక యువకుడు బల్లెంతో ఆయనపై లంఘిస్తూ ఉండగానే...

"ఒరేయ్! ఈయన ఎవరో నీకు తెలుసా?" అన్నారెవరో. **"ఈయన మామూలు మనిషి కారు. యమామ రాజ్యపాలకుడైన సుమామా గారీయన. దైవం తోడు! మన వల్ల ఈయనకే దైనా అపకారం జరిగిందంటే ఈయన జాతి జనాలు మనపై ఆర్థిక ఆంక్షలు విధిస్తారు. మనం ఆకలితో అలమటించాల్సి వస్తుంది, తెలుసా?".**

ఈ మాటలు వినగానే అందరి ఖడ్గాలు ఒక్క సారిగా వారి ఒరల్లో ఒదిగిపోయాయి. ఆ తర్వాత నగర పెద్దలు సుమామా (ర)తో చర్చలు జరిపారు. **"సుమామా! అసలు మీకేమై పోయింది? మీరెందుకు ధర్మ విహీనులయ్యారు? మీరు మీ పూర్వీకుల మతధర్మాన్ని విడిచి పెట్టేశారా?"**

"నేను ధర్మ విహీనుణ్ణి కాలేదు. మరింత గొప్ప ధర్మాన్ని అవలంబిస్తున్నాను. కాబా ప్రభువు సాక్షిగా చెబుతున్నా! ఇక నుంచి నజద్ ప్రాంతం వారు ముహమ్మద్(స)కు విధేయత చూపకపకపోతే ఒక్క గోధుమ గింజ కూడా పంపించను" అని తెగేసి చెప్పేశారు.

కురైషులపై ఒక్కసారిగా పిడుగుపడినట్లయింది. వారంతా చూస్తూ ఉండగానే సుమామా ఉమ్రా చేశారు. అదీ మహాప్రవక్త (స) సూచించిన పద్ధతి ప్రకారం చేశారు. ఉమ్రా అనంతరం ఆయన దైవ మార్గంలో ఒక పశువును ఖుర్బానీ చేసి, తన స్వరాజ్యానికి తిరుగు ప్రయాణమయ్యారు. యమామా చేరగానే రాజ్య ప్రముఖులనుద్దేశించి, ఇక మీదట కురైషులకు ఆర్థిక సహాయం చేయరాదని ఆజ్ఞాపించారు. అంతే! తక్షణం ఆర్థిక ఆంక్షలు అమలుపరచబడ్డాయి.

సుమామా బిన్ అసాల్(ర) గారు విధించిన ఆర్థిక ఆంక్షల ఫలితంగా మక్కాలో కష్టాలు మొదలైనాయి. కరవు తాండవించింది. పౌర సరఫరాలకు అంతరాయం కలిగింది. ధరలు పెరిగిపోయాయి. ప్రజలు ఆకలితో అలమటించసాగారు. తమ పసిపిల్లలు ఆకలితో ప్రాణాలు కోల్పోతారేమోనని కురైషులు భయపడిపోయారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితిలో దైవ ప్రవక్త (స)కు ఉత్తరం వ్రాయటం తప్ప మార్గాంతరం లేదని వారు తెలుసుకున్నారు. కురైషులు వ్రాసిన లేఖ సారాంశమిది:

"మీరు బంధుత్వ సంబంధాలను గురించి నొక్కి వక్కాణించేవారు. ఇతరులకు కూడా బంధుత్వ హక్కును గురించి ఉపదేశిస్తారనుకున్నాం. కాని మీరు బంధుత్వ తెగత్రెంపులకు పురికొల్పుతున్నట్లు అర్థమవుతోంది. ఈ బంధుత్వ విచ్ఛిన్నానికి మా పెద్దలు తల్లడిల్లిపోయారు. మా పిల్లలు ఆకలితో మాడిపోయారు. ఇలా చెప్పటంలోని మా ఉద్దేశమేమిటంటే సుమామా బిన్ అసాల్ మాకు అందే ఆర్థిక సహాయాన్ని నిలిపివేశారు. మీరు దయ చేసి ఈ ఆర్థిక సహాయనిన్న పునరుద్ధరించవలసిందిగా సుమామకు ఆదేశించండి ....."

వెంటనే దైవప్రవక్త(స) సుమామాకు ఉత్తరం వ్రాస్తూ కురైషులకు నిలిపివేసిన ఆర్థిక సహాయాన్ని తిరిగి కొనసాగించవలసిందిగా సూచించారు. ప్రవక్త(స)వారి ఆజ్ఞను శిరసావహిస్తూ సుమామా ఆహార ధాన్యాలను ఎగుమతి చేశారు.

హిజ్రత్ సుమామా బిన్ అసాల్(ర) జీవితాంతం విశ్వాసపాత్రునిగా మెలిగారు. దైవ ప్రవక్త (స)కు ఇచ్చిన మాటను నిలుపుకున్నారు.

దైవప్రవక్త(స) పరమపదించినపుడు కొంత మంది దైవధర్మం పట్ల విముఖత చూపసాగారు. ఆ రోజుల్లోనే ముసైలమా కజ్జాబ్ తల ఎత్తాడు. ఆ అబద్ధాలకోరు తనను దైవ ప్రవక్తగా ప్రకటించుకున్నాడు. అప్పుడు సుమామా తన జాతి జనులను ముసైలమా ఉపద్రవం నుండి రక్షింటానికి నడుం బిగించారు. ఆయన ఇలా అన్నారు:

"ఓ హనీఫా తెగవారలారా! మీరు దారికి రండి. ముసైలమా కజ్జాబ్ బారి నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి. బాగా తెలుసుకోండి! ముహమ్మద్(స) అల్లాహ్ సత్య ప్రవక్త. ఆయన(స) తదనంతరం మరో ఎవరూ ప్రళయదినం వరకూ రారు. ఓ బనూ హనీఫా కాంతి కిరణం లేని ఆ అంధకార బంధురం నుంచి బయట పడండి. దైవసాక్షి! ఆ అసత్య వాది మాట వినటంకన్నా దౌర్భాగ్యం మరొకటి లేదు. వాడి మాటను త్రోసిపుచ్చిన వారే ధన్య జీవులు."

ఆ తరువాత ఆయన(స) దివ్య ఖుర్ఆన్‌లోని ఈ సూక్తుల్ని పఠించారు: **"ఈ గ్రంథావతరణ అల్లాహ్ తరపున జరిగింది. ఆయన మహా శక్తిమంతుడు, సర్వం తెలిసినవాడు. పాపాలను క్షమించేవాడు, పశ్చాత్తాపాన్ని ఆమోదించేవాడు, కఠినంగా శిక్షించేవాడు, ఆయన తప్ప వేరే ఆరాధ్య దైవం లేడు. ఆయన వద్దకే మరలి పోవలసి ఉన్నది."** (అల్ మోమిన్-2,3)

మీరే చెప్పండి – అల్లాహ్ అవతరింపజేసిన ఈ పవిత్ర వాక్కుల ముందు ముసైలమా కజ్జాబ్ చేసే అధిక ప్రసంగం ఏ పాటిది? ఉదాహరణకు ఆ సత్యవిరోధి సూక్తుల్ని చూడండి.....

"బెకబెకమనే ఓ మండూకమా! నీ బెకబెకలు ఎంత వరకు? త్రాగేవారెవరినీ అడ్డుకోలేవు. కనీసం నీళ్ళనయినా కలుషితం చెయ్యలేవు."

ఆ తర్వాత సుమామా తన జాతి జనులలో ధర్మంపై స్థిరంగా ఉన్న వారిని సమీకరించి, ధర్మభ్రష్టులకు వ్యతిరేకంగా పోరాటం మొదలెట్టారు. భూమండలంలో దైవవాక్కు ఉన్నతికై అహరహం కృషి చేశారు.

అల్లాహ్ ఇస్లాం ముద్దు బిడ్డ అయిన సుమామా బిన్ అసాల్(ర)కి ఉత్తమ ప్రతిఫలం ప్రసాదించుగాక! స్వర్గంలో ఈయనకు దైవభీతిపరుల సరసన చోటు కల్పించుగాక !!

(ఆమీన్)

- మౌలానా ముహమ్మద్ కలీమ్ సిద్దీఖీ

మీ సొత్తు మీ పరం-1



నన్ను క్షమించండి

ప్రియ పాఠకులారా! నన్ను క్షమించండి. నేను నా తరపు నుండి, ముస్లిం సమాజం తరపు నుండి క్షమాపణ కోరుతున్నాను. ఎందుకంటే ముస్లిములు మానవాళికి శత్రువయిన షైతాన్ వలలో చిక్కుకుని తమ వద్ద సొత్తుగా ఉన్న మీ గొప్ప సంపదను మీ వరకు చేరవేయలేదు. ఆ షైతాన్– పాప పంకిలమైన మనిషి హృదయంలో తిష్టవేసి ప్రపంచాన్నంతా యుద్ధ మైదానంగా మార్చివేశాడు. ఈ తప్పిదాన్ని గుర్తించి నిస్వార్థంతో ప్రేమ, మానవత్వానికి సంబంధించిన మీతో చెప్పాలని వాటిని మీకు అందజేస్తున్నాను.

నిజ యజమాని అయిన అల్లాహ్ మానవుల సంకల్పాలు తెలిసినవాడు. ఈ పుస్తకాన్ని మీదాక చేరవేయడంలో నేను నిస్వార్థపరుడయి, నిజమైన అనురక్తితో నిర్వర్తించదలిచానని ఆయనకు తెలుసు. ఇన్నాళ్ళుగా ఈ విషయాలను మీకు తెలియజేయనందుకు నాకు ఎన్నో రాత్రులు నిద్ర కరువైంది. మీకూ ఒక మనసుంది. అది ఎంతో స్వచ్ఛమైనది. సత్యాన్ని దాచి వేస్తే అది ఎంత వ్యాకులతకు గురవు తుందో దానిని అడగండి.

ఇదొక ప్రేమవాణి

ఇది నేను చెప్పవలసింది కాదు కానీ నా మాటలు ప్రేమ వాణికి సంబంధించినవి. వాటిని మీరు మనో నేత్రాలతో చదవాలని నా అభిలాష. సర్వాన్ని సృష్టించి ఆ సృష్టిని నడుపుతున్న యజమానిని మీరు గనుక గుర్తించినట్లయితే నా ఆత్మకు శాంతి లభిస్తుంది. నా సోదర సోదరీమణులకు వారి సొత్తును అందజేసిన ఒక సోదరునిగా నా కర్తవ్యాన్ని నెరవేర్చానని భావించుకుంటాను.

మనిషి ఈ ప్రపంచంలోకి వచ్చిన తరువాత సత్యాన్ని తెలుసుకుని దానిని విశ్వసించడం తప్పనిసరి, ఇంకా ఇది అతడి కర్తవ్యం కూడా. నేను ఆ సత్యాన్ని మీకు వినిపించదలిచాను.

ప్రపంచంలో అన్నింటికన్నా గొప్ప సత్యం

ఈ ప్రపంచంలోనే కాదు, ప్రకృతిలోనూ గొప్ప సత్యం ఏమిటంటే ఈ సృష్టిని సృష్టించినవాడు, దానిని నడిపించేవాడు కేవలం ఒకే ఒక్క ప్రభువు. ఆయన తన అస్తిత్వం (ఉనికి)లో, గుణగణాలలో ఒకే ఒక్కడు. ప్రపంచాన్ని సృష్టించడంలో, మృత్యువునివ్వడంలో, ప్రాణం పోయడంలో ఆయనకు భాగస్వాములెవ్వరూ లేరు. ఆయన ప్రతి ఒక్కరి మొరను వినేవాడు. సృష్టిలో ఒక్క ఆకు కూడా ఆయన ఆజ్ఞ లేనిదే కదలదు. అంతే కాదు, మనిషి ఏ ధర్మాన్ని ఆచరించే వాడయినా, ఆస్తికుడనా, నాస్తికుడైనా ప్రతి వ్యక్తి అంతరాత్మ ఇచ్చే సాక్షి ఈ సృష్టికి కర్త ఒకే ఒక్కడే అన్నది. దివ్య ఖుర్ఆన్‌లో ఇలా ఉంది:

“ఒకవేళ భూమిపై, ఆకాశాలలో ఒక్క అల్లాహ్ మినహా అనేక దేవుళ్ళు గనక ఉన్నట్లయితే ఈ భువనగగనాల వ్యవస్థ చిన్నాభిన్నమయ్యేది”.

నిజమైన సాక్ష్యం

నియమానుసారంగా నడుస్తున్న సృష్టికి దేవుడు కేవలం ఒక్కడేనని, అందులోని ప్రతి వస్తువు సాక్ష్యమిస్తోంది. ఆయన ఎప్పుడు ఏదనుకుంటే అది చేయగలడు. అలాంటి శక్తి శాలి విగ్రహాన్నీ మనం తయారు చేయలేము ఆయనను మన కల్పనలోగాని, మన ఊహల లోగాని సాకారం చేయలేము. ఆయన విగ్రహాన్నీ మనం తయారు చేయలేము. ఆయన సృష్టిని మానవుల సేవ కోసం సృష్టించాడు. సూర్యుడు, వాయువు, మనిషి సేవకోసం సృష్టించబడ్డాయి. భూమి కూడా మనిషి సేవ కోసమే. అగ్ని, నీరు, జీవరాశులు సృష్టిలోని ప్రతి వస్తువు మనిషి సేవ కోసమే సృష్టించి మానవుణ్ణి వాటికి నాయకుడిగా నియమించడం జరిగింది. కానీ మనిషిని మాత్రం తన దాసునిగా, తనను ఆరాధించేవానిగా తన ఆజ్ఞాపాలనకు తలదాల్చేవానిగా సృజించాడు.

న్యాయంగా చెప్పాలంటే, సృజించినవాడు, ప్రాణం పోసేవాడు, ప్రాణం తీసేవాడు, జీవించడానికి కావలసిన ప్రతి వస్తువును ఇచ్చేవాడు అల్లాహ్ అయినప్పుడు, దాసుడన్నవాడు తనకు జీవితాన్ని, జీవితానికి సంబంధించిన వస్తువులను ప్రసాదించిన వాని ఇష్ట ప్రకారమే వినియోగించాలి. ఒకవేళ తన ఏకైక ప్రభువు ఆజ్ఞను పాలించకుండా జీవితం గడుపుతున్నట్లయితే అలాంటి మనిషి మనిషే కాదు.

ఒక గొప్ప సత్యం

నిజ యజమాని తన సత్య గ్రంథం ఖుర్ఆన్‌లో–

“ప్రతి ప్రాణి మరణాన్ని చవిచూడ వలసి ఉంది. తరువాత మీరందరూ మా వైపునకే మరలి రావలసి ఉంది”. (అన్ కబూత్: 8)

అనే ఒక సత్యాన్ని మనకు తెలిపాడు.

ఈ ఆయత్ లో రెండు భాగాలున్నాయి. ఒకటి – ప్రాణం పోయడంలో ఆయనతో పాటు మరొకరెవరు భాగస్వామి లేదు. ఆయన ప్రతి ఒక్కరి మొరను వినేవాడు. శక్తి గలవాడు. ప్రతి ఒక్కరిని చూసేవాడు. సృష్టిలోని ఒక్క ఆకు కూడా ఆయన ఆజ్ఞ లేనిదే కదలదు. అంతేకాదు మనిషి ఏ ధర్మాన్ని ఆచరించే వాడయినా, లేక విగ్రహారాధకుడయినా సరే, ప్రతివాని అంతరాత్మ అసలైన పోషణకర్త, నిజప్రభువు కేవలం ఒకే ఒక్క దేవుడని సాక్ష్యం పలుకుతూ విశ్వసిస్తోంది.

మానవుని ఆలోచనలో కూడా సర్వ సృష్టికర్త ఒక్కడేనన్న స్ఫురణ కలుగుతోంది. అది ఎలా అంటే ఒక కాలేజీకి ఇద్దరు ప్రిన్సిపాళ్ళు ఉన్నట్లయితే ఆ కాలేజీ నడవజాలదు. ఒక గ్రామానికి ఇద్దరు గ్రామాధికారులు ఉన్నట్లయితే గ్రామ పరిపాలన సవ్యంగా సాగదు. ఒక దేశానికి ఇద్దరు రాజులు ఉండరు మరి. ఇంత పెద్ద సృష్టికి పాలకుడు ఒక్క దేవుని కంటే ఎక్కువ ఎలా ఉండగలరు? అనేక పరిపాలకులు ఉంటే సృష్టి ఎలా నడవగలుగుతుంది? సృష్టిలో అనేక మంది పరిపాలకులు ఎలా ఉండగలుగుతారు?

ఒక దృష్టాంతం

ఖుర్ఆన్ దైవవాణి. అందుకే అది ఇలా సవాలు చేస్తోంది:

“.....అది మా గ్రంథం అవునో కాదో అని మీకు సందేహం ఉన్నట్ల యితే దానివంటి ఒక్క సూరానైనా మీరు రచించి తీసుకురండి. మీ సహచరులందరినీ పిలుచుకోండి. ఒక్క అల్లాహ్ తప్ప మరెవరి సహాయాన్నయినా పొందండి. మీరు సత్య వంతులే అయితే.”

(అల్ బఖర:23)

పధ్నాలుగు వందల సంవత్సరాల నుండి ఈనాటి వరకు ప్రపంచ ప్రజలు,సైన్స్, కంప్యూటర్ మొదలయినవాటిని పరిశోధించే వారు దివ్య ఖుర్ఆన్‌ను కూడా పరిశీంచి అలసిపోయారు. చివరికి వారు తమ తలలు దించుకున్నారే గాని, ఎవరు కూడా ఇది దేవుని గ్రంథం కాదని చెప్పడానికి సాహసం చేయలేకపోయారు. అందులోని ఒక ఒక్క అధ్యాయాన్ని సయితం లిఖించి తీసుకురాలేక పోయారు

సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ
abdussalamsyed@ymail.com

సంస్కరణ అంచెల వారీగా జరగాలి

విత్తనం నాటిన మరుక్షణమే అది మహా వృక్షమై నిలవాలనుకోవడం అత్యాసే కాదే అనేక అనర్థాలకు దారి తీయగలదు. కాబట్టి సంఘ సంస్కర్తలు, ప్రజల్లో పరివర్తనం కోసం అహరహం పరిశ్రమించే శ్రేయోభిలాషులు ప్రజలను తరుముకొచ్చి హితబోధ చెయ్యటం, వారి లో వెనువెంటనే పెనుమార్పులను ఆశించడం ఎంత మాత్రం సమంజ సం కాదు. అందు నిమిత్తం ప్రజల ఆర్థిక కుటుంబ పరిస్థితుల్ని, పరి సరాల్ని గమనించాలి. సరైన అవకాశం కోసం ఎదురు చూడాలి. అవసరం అన్పించినప్పుడు హితోపదేశం అనువైన రీతిలో, కావాల్సిన మోతాదులో చేసి వారిని గొప్ప వ్యక్తులుగా, బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నించాలి. ఈ విషయంలో వారు ఒక రైతులా వ్యవహరించాలి.

రైతు అనువైన నేలను ఎన్నుకొని, వర్షం కోసం పడిగాపులు కాస్తాడు. వాన కురిసిన తర్వాత భూమిని దున్ని, దుక్కి చేస్తాడు. ఆ తర్వాత సమయం, అదను చూసి విత్తనాలు జల్లుతాడు. మధ్య మధ్యలో కలుపు తీస్తూ, కంప లాగుతూ, అవసరం అన్పిస్తే గుళికలు చల్లుతూ, పశువులు-ఇతరత్రా జంతువుల బారి నుండి పైరును కాపాడుతూ, పసిడి పంటను ఆశిస్తాడు. దీనికి భిన్నంగా నేల ఎంపిక సరిగా లేక పోయినా, వర్షాలు పడిన తర్వాత కూడా దున్నకపోయినా, విత్తనాలు జల్లిన తర్వాత వాటి అవసరాలను తీర్చకపోయినా పంట రైతు చేతికి రాదు. అతని శ్రమ, సమయం, త్యాగం, ధనం- అంతా బురదలో పోసిన పన్నీరవుతుంది.

ఈ విషయంలో మహా ప్రవక్త (స) వారి ఆదర్శం మనందరికి శిరో ధార్యం. ఆయన విలక్షణ శిక్షణలో గల ముఖ్యాంశం ఏమిటంటే, ఆయన (స) వ్యక్తి శక్తిని బట్టి ఉక్తి చెప్పి విధుల్ని మోపేవారు. మనిషిలో ఒక అవలక్షణాన్ని రూపుమాపి, ఒక మంచి లక్షణాన్ని పెంపొందించే వారు. ఖుర్ఆన్ ఒక్కసారిగా ఎందుకు అవతరించలేదు? అన్న కొందరి అభ్యంతరానికి బదులిస్తూ స్వయంగా ఆ పరమ జ్ఞాని అయిన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"దీని ద్వారా నీ మనసును దృఢంగా ఉంచడానికి మేము దీనిని ఇలాగే (కొద్ది కొద్దిగా) అంచెల వారీగా పంపాము". (ఫుర్ఖాన్: 32)

మరో చోట ఇలా ఉంది: **"నువ్వు నెమ్మది నెమ్మదిగా ప్రజలకు వినిపించడానికి (వారు సులువుగా అమలుపర్చడానికి) వీలుగా మేము ఖుర్ఆన్ గ్రంథాన్ని కొద్ది కొద్దిగా చేసి అవతరింపజేశాము. మేము దీనిని (అందరి శిక్షణార్థమే) అంచెలావారీగా దింపాము".**(ఇస్రా: 106)

ఖుర్ఆన్ గ్రంథం ఆకాశం నుంచి కురిసే వానజల్లు వంటిది. వర్షం పడినప్పుడల్లా మృత భూమిలో ప్రాణం వస్తుంది. బీటలు వారిన నేల ఒక్కసారిగా ఉబుకుతుంది. చిగుళ్ళు పోసుకుంటుంది. అయితే ఒక్క సారి కుండపోతగా పడి ఆగిపోవడం కన్నా ఆగి ఆగి అవసరాన్ని బట్టి తెరలు తెరలుగా వస్తూ ఉంటే అది ఎంతో ప్రయోజనదాయకం అవుతుంది. అందుకే దివ్య ఖుర్ఆన్ 23 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో పరిస్థితుల స్వరూపాన్ని, స్వభావాన్ని బట్టి అవతరించి విశ్వ జనుల మనో భూమిని సస్యశ్యామలం చేసింది. ఈ విధానాన్నే దైవ ప్రవక్త (స) తన కార్యాచరణ రంగంలో అక్షరాల అమలు పరచి చూపారు. మచ్చుకు కొన్ని ఉదాహరణలు -

హజ్రత్ మాజ్ బిన్ జబల్ (ర) గారిని 'యమన్' వాసుల వైపు పంపిస్తూ దైవ ప్రవక్త (స) ఇలా హితోపదేశం చేశారు. "ఓ మఆజ్! నువ్వు వెళుతున్న దేశస్థులు గ్రంథ ప్రజలు. నువ్వు వారిని ముందు దేవుని ఏకత్వం (తౌహీద్) వైపు, దైవ దౌత్యం (రిసాలత్) వైపునకు ఆహ్వానించు. **'లా ఇలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్రసూలుల్లాహ్'** - అల్లాహ్‌ను నిజ దైవంగా, ముహమ్మద్ (స)ను దైవ అంతిమ ప్రవక్తగా వారు అంగీకరిస్తే, తర్వాత అల్లాహ్ వారిపై ఐదు పూటల నమాజు విధి గావించాడన్న విషయాన్ని విశదపర్చు. దాన్ని వారు పాటిస్తే అల్లాహ్ వారి సంపాదనపై జకాతు ఫర్జ్ చేశాడు, అది ధనికుల నుండి వసూలు చేసి వారిలోని పేదవారిపై ఖర్చు చేయబడుతుందని తెలియజెయ్యి".

అలాగే - **'జకాతు'** విధిగా నిర్ణయించబడి, జనుల నుండి జకాతు వసూలు చేయవలసిందిగా మహా ప్రవక్త ముహమ్మద్ (స)ను అల్లాహ్ ఆదేశించినప్పుడు, ఆయన ఒక వ్యక్తిని జకాతు వసూలు చేయడానికి నియమించి పంపుతూ - **"ప్రజలకు ఇష్టమైన, మనోజ్ఞంగా అన్పించే మేలు రకం సరకును జకాతుగా తీసుకోకు. ముసలి ఒంటెల్ని, గొడ్డు పోయిన వాటిని, ఏవైనా వంకలు, లోపాలు ఉన్నవాటినే తీసుకో"** అని ఆదేశించారు. కనుక ఆ వ్యక్తి మహా ప్రవక్త (స) వారి ఆజ్ఞానుసారం గానే ప్రజల పశువుల్లో నుండి జకాతు వసూలు చేయసాగాడు. చివరికి ఓ పల్లెటూరి వ్యక్తి ఇంటకెళ్లి - 'అల్లాహ్ తన ప్రవక్తకు ప్రజల నుండి జకాతు వసూలు చేయడానికి ఆదేశించాడు. జకాతు ప్రజల (ఆత్మలను) ప్రక్షాళిస్తుంది. వారి సొమ్మును శుద్ధ పరుస్తుంది. వారి విశ్వాసాన్ని ద్విగుణీకృతం చేస్తుంది' అని తెలిపాడు. ఆ పల్లెవాసి అతనితో, వెళ్ళి తన పశువుల మందలోంచి జకాత్‌కి సరిపడా పశువుల్ని తోలుకుపొమ్మ న్నాడు. ఆ వ్యక్తి వెళ్ళి వంకలున్న, గొడ్డుపోయిన, ఒంటెల్ని ఏరి తీశాడు. అది చూసిన ఆ పల్లెవాసి అతనితో - **"నీకన్నా ముందు మా పశువుల్లో నుండి, అల్లాహ్ కొరకు జకాత్ వసూలు చేయడానికి ఎవరూ రాలేదు. అల్లాహ్ సాక్షి! నీవు మట్టుకు ఉత్తమమైన ఒంటెల్నే తీసుకోవలసి ఉంటుంది"** అన్నాడు. (కితాబుల్ ఖిరాజ్)

పైన పేర్కొనబడిన రెండు హదీసుల ద్వారా బోధపడేదేమంటే-, ప్రజలు ధర్మాన్ని స్వీకరించి, విశ్వాసం పటిష్టంగా రూపొందాక అంచెల వారీగా ఒక్కో విధిని వారిపై నిర్ణయించాలి. అప్పుడు వారిలో తాము చేస్తున్న ప్రతి సత్కార్యం అల్లాహ్ అభీష్టం, ప్రసన్నత కోసమేనన్న పవిత్ర భావన ఏర్పడుతుంది. వద్దంటున్నా, మేలు రకమైన ఒంటెల్ని ఆ గ్రామ స్థుడు ఇవ్వడం దీనికి ప్రబల తార్కాణం. ఒక్క మాటలో చెప్పాలంటే-, ధర్మ విషయంలోగానీ, కుటుంబ విషయంలోగానీ, సంఘం, దేశం విష యంలోగాని దేనికి ముందు ప్రాధాన్యత ఇవ్వాలో దానికే ఇవ్వాలి.

అంచెలవారీగా సంస్కరణ అన్న విషయాన్ని విశదపరుస్తూ విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా (ర) ఇలా అభిప్రాయపడ్డారు: "ఖుర్ఆన్‌లో తొలుత స్వర్గ నరక విశేషాలతో కూడిన వచనాలే అవతరించాయి. ప్రజలు సత్య ధర్మ ఛత్రఛాయల్లోకి వచ్చేశాక హలాల్-హరామ్‌కి సంబంధించిన వచనాలు అవతరించాయి. సారాయి, జూదాన్ని, వ్యభి చారాన్ని నిషేధించే వచనాలు ముందే అవతరించి ఉండి ఉంటే, ప్రజలు గొంతు చించి మరి "మేము మద్యపానం, మగువలోలత్వం, జూదమాడటాన్ని ససేమీరా వదులుకోమని నోరు బాదుకునేవారు".

(బుఖారి)

అలాగే పిల్లల విషయంలో ప్రవక్త (స) చూపిన విధానం సయితం మనందరికీ ఆదర్శప్రాయం. 7 సంవత్సరాల వరకు వారిని ఆడుకో నివ్వాలి. ఆ తర్వాత నమాజును గూర్చి ఆదేశించాలని. పదేండ్లు దాటి కూడా నమాజుకు వెళ్ళ నిరాకరిస్తే మందలించాలి. మొండికెస్తే దండించాలి. పది సంవత్సరాల వయస్సుకు చేరుకోగానే అన్నా చెల్లెళ్ల, అక్కా తమ్ముళ్ల పడకల్ని వేరు చేయాలని పురమాయించారు మహనీయ ముహమ్మద్ (స).

ముహమ్మద్ సాలెహ్ అల్ ఉసైమీన్
అనువాదం: ముహమ్మద్ సలీమ్ జామయీ

ఉపవాసం విరమిస్తున్నానని సంకల్పం చేసుకున్న వ్యక్తి ఉపవాసం భంగమౌతుందా?



ప్రశ్న: ఒక వ్యక్తి చాలా శ్రమతో కూడిన పని చేస్తూ ఉంటాడు. తత్కారణంగా ఉపవాసాలుండటం అతని వీలు పడదు. అలాంటి వ్యక్తికి ఉపవాస విషయంలో మినహాయింపు ఏమైనా ఉందా?

జ: పని కష్టమైనదని చెప్పి ఉపవాసాల్ని వదలేయడం సరికాదు. అతనికి అలాంటి అనుమతి లేదు. ఒకవేళ అతను పని భారం వల్ల ఉపవాసాలు ఉండలేకపోతున్నాడంటే రమజాను నెలలో సెలవు తీసుకోవడం ఉత్తమం. ఎందుకంటే, రమజాను ఉపవాసాలుండటం అనేదీ (సాధారణమైన ఆరాధన కాదు) ఇస్లాం మూలాధారాల్లోని ఒక మూలాధారం. మరి ఈ ముఖ్య విషయంలో అశ్రద్ధ కనబర్చడం ధర్మసమ్మతం కాదు.

ప్రశ్న: తన భార్యాబిడ్డలను పోషించాలని సంపాదనలో పడి రమజాను ఉపవాసాలు వదిలేసేవాడు ఒక వ్యక్తి. అతని గురించి మీ అభిప్రాయం ఏమిటి?

జ: వ్యాధిగ్రస్తుడికి వ్యాధి కారణంగా ఉపవాసం నుండి మినహాయింపు ఉంది కదా! అలాగే నాకు భార్యాబిడ్డలను పోషించడం కోసం శ్రమిస్తున్నానన్న కారణంతో ఉపవాస విధి నుండి మినహాయింపు లభిస్తుందిలే అనే పొరపాటు ఆలోచనతో ఎవరైనా ఉపావాసాలు వదిలేసినట్లయితే, అలాంటి వ్యక్తి జీవించి ఉంటే అతను వదిలేసిన ఉపవాసాలను ఖజా చేసుకోవాలి. ఒకవేళ అతనికి మరణం సంభవించినట్లయితే అతని వారసులు అతని తరఫున ఉపవాసాలు ఉండాలి లేదా ప్రతి ఉపవాసానికి బదులు ఒక బీదవానికి అన్నం తినిపించాలి.

ఒకవేళ ఎలాంటి పొరపాటు నిర్ణయం లేకుండా ఆ వ్యక్తి కావాలనే ఉపవాసాలు వదిలేసి ఉంటే...ధార్మిక పండితుల వాస్తవానికి దగ్గరగా ఉన్న తీర్పు ఏమిటంటే, నిర్ణీత సమయంతో ముడిపడి ఉన్న ఆరాధనను అకారణంగా సమయానికి ఆచరించకపోతే అది స్వీకరంచబడదు. కాబట్టి అతను సత్కార్యాలు, నఫిల్ ఆరాధనలు మరియు క్షమాభిక్ష అడగటం వంటివి అధికంగా చేస్తూ ఉండాలి. ప్రవక్త (స) వారి ప్రవచనం ఏమిటంటే – **"మా సంప్రదాయంలో లేని విషయాన్ని ఎవరైతే అమలు పరుస్తారో అది రద్దు చేయబడుతుంది"**. అన్నది.

ఏ విధంగానయితే నిర్ణీత సమయంలో చేయాల్సిన ఆరాధనను దాని సమయం కంటే ముందు చేయడం సముచితం కాదో అదే విధంగా దాని సమయం గడిచిపోయిన తర్వాత చేయడం కూడా సమంజసం కాదు. కాకపోతే, అజ్ఞానం కారణంగా, నిద్ర కారణంగా ఓ వ్యక్తి అలా చేస్తే అతను, తెలిసిన మీదట, నిద్ర నుండి మేల్కొన్న వెంటనే దాన్ని ఖజా చేయాలి.

నిద్రపోయిన వ్యక్తిని గురించి ప్రవక్త (స) ఇలా తెలియజేశారు: "ఏ వ్యక్తి అయితే నమాజు చేయడం మరచిపోయాడో లేదా ఆ సమయానికి నిద్ర నుండి మేల్కోలేకపోయాడో అతని చెల్లించాల్సిన పరిహారం ఏమిటంటే, గుర్తొచ్చిన వెంటనే నమాజు చేసుకోవాలి". (ముస్లిం)

ప్రశ్న: ఎలాంటి అన్నపానీయాలు తీసుకోకుండా ఉపవాసం విరమిస్తున్నానని సంకల్పం చేసుకున్న వ్యక్తి ఉపవాసం భంగమైపోతుందా?

జ: ఉపవాసంలో (ఇతర ఆరాధనల్లోగానీ) సంకల్పం ముఖ్యమైన విషయమని, ఉపవాస స్థితిలో కొన్నింటికి దూరంగా ఉండాలని అందరికి తెలిసివ విషయమే. మనిషి ఉపవాసానికి భంగం కలిగించే చర్యలకు దూరంగా ఉంటూ దైవ సాన్నిహిత్యం పొందటానికి ఉపవాస సంకల్పం చేసుకుంటాడు.

ఒకవేళ మనిషి ఉపవాస విరమణ చేసేసుకుంటున్నాని ఖచ్చితమైన సంకల్పం చేసుకుంటే అతని ఉపవాసం భంగమైపోతుంది. ఆ ఉపవాసం రమజాను నెలదైతే అతను సూర్యాస్తమయం వరకు ఆహారపానీయాలకు దూరంగా ఉండాలి. ఎందుకంటే, అకారణంగా రమజాను ఉపవాసం వదిలేసిన వ్యక్తి సూర్యాస్తమయం వరకు అన్నపానియాలకు దూరంగా ఉండటం తర్వాత ఆ ఉపవాసాన్ని ఖజా చేసుకోవడం తప్పనిసరి కాబట్టి.

ఒకవేళ సదరు వ్యక్తి ఖచ్చితమైన నిర్ణయం తీసుకోక, సందిగ్ధంలోనే ఉన్నా అతని ఉపవాసం భంగమైపొందన్నది కొందరు పండితు అభిప్రాయం. మరికొందరి అభిప్రాయం ప్రకారం – అతని ఉపవాసం భంగమవదు. ఎందుకంటే, అతనిలో ఇంకా సంకల్పం మిగిలి ఉంది, పూర్తిగా నశించలేదు కాబట్టి. పూర్తిగా సంకల్పం తొలగి పొతే ఉపవాసం భంగమైపోతుంది. అలా కాకుండా సందిగ్ధంలో ఉన్నప్పుడు సంకల్పం మిగిలి ఉంటుంది గనక ఉపవాసం భంగమవదు.

హేతుబద్ధత, మరియు ఆధారాల రీత్యా రెండవ అభిప్రాయమే సరైనదని నా అభిమతం. 'సంపూర్ణమైన జ్ఞానం కేవలం అల్లాహ్ కు మాత్రమే ఉంది' **(అల్లాహు ఆలమ్).**

ముస్లిం జీవితానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు

ప్రశ్న: ఒక ముస్లిం తన విశ్వాసాన్ని(అఖీదహ్) ఎక్కడి నుంచి గ్రహించాలి?

జ: అతను తన విశ్వాసాన్ని దైవగ్రథమైన ఖుర్‌ఆన్ నుండి, దైవప్రవక్త ముహమ్మద్ (స) గారి ప్రామాణిక హదీసుల నుండి గ్రహించాలి. **"ఆయన(స) తన మనోభిరామం ప్రకారం ఏదీ చెప్పరు. ఆయన చెప్పేదంతా ఆయన వద్దకు పంపబడిన దైవవాణి(వహీ) అయి వుంటుంది".** (అన్ నజ్మ్-4) మరో విధంగా చెప్పాలంటే ఒక ముస్లిం విశ్వాసం, నమ్మకం (అఖీదహ్) ప్రవక్త ప్రియ సహచరుల అవగాహనకు, తొలికాలపు సజ్జనుల అభిమతానికి అనుగుణంగా ఉండాలి.

ప్రశ్న: ఇస్లాం ధర్మంలోని అంతస్థులు ఎన్ని?

జ: ఇస్లాం ధర్మంలోని అంతస్తులు మూడు. (1) ఇస్లాం. (2) ఈమాన్. (3) ఇహ్‌సాన్.

ప్రశ్న: ఇస్లాం అని దేనినంటారు? దాని మౌలిక అంశాలెన్ని?

జ: అల్లాహ్ ఒక్కడే అనే ఏకత్వపు అంశాన్ని గట్టిగా నమ్ముతూ ఆయన విధేయతా విధానాన్ని అవలంబిస్తూ ఆయన ఆజ్ఞలను శిరసావహించాలి. షిర్క్(బహుదైవారాధన) నుండి, ముష్రిక్కుల (బహుదైవారాధకుల) నుండి తెగ త్రెంపులు చేసుకుంటున్నట్లు స్పష్టంగా ప్రకటించాలి. ఇదే ఇస్లాం అంటే. ఇస్లాం మౌలికాంశాలు అయిదు. దైవప్రవక్త(స) ప్రవచనం ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది.

ఇస్లాం పునాది అయిదు విషయాలపై ఉన్నది. (1) అల్లాహ్ తప్ప వేరొక నిజ ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్(స) అల్లాహ్ ప్రవక్త అని సాక్ష్యమివ్వటం (2) నమాజు (వ్యవస్థ)ను నెలకొల్పటం (3) జకాత్‌ను ఇవ్వటం (4) అల్లాహ్ గృహాన్ని సందర్శించి హజ్ చేయటం (5) రమజాన్ ఉపవాసాలను పాటించటం

(బుఖారీ,ముస్లిం)

ప్రశ్న: "ఈమాన్" అని దేనినంటారు? దాని ముఖ్యాంశాలెన్ని?

జ: హృదయంలోని నమ్మకం, నోటి మాట, శరీరావయవాల చేత వ్యక్తమయ్యే ఆచరణ-ఈ మూడింటి సమాహారమే ఈమాన్ (విశ్వాసం). మరో విధంగా చెప్పాలంటే మనసా, వాచా, కర్మణా నిరూపించుకునే ఒకానొక నిర్ధారిత సదాచరణే ఈమాన్. విధేయతా భావం పెరిగిన కొలదీ ఈమాన్ వికసిస్తూ ఉంటుంది. పాపాల వల్ల ఇది క్షీణిస్తూ ఉంటుంది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **"వారి విశ్వాసంతో పాటు మరింత విశ్వాసం పెంపొందటానికి"**

(అల్ ఫతహ్: 4)

దైవప్రవక్త(స) ఈమాన్(విశ్వాస) విస్తృత పరిధిని వివరిస్తూ ఇలా చెప్పారు: "ఈమాన్ శాఖలు డెబ్భైకి పై చిలుకు ఉన్నాయి. అన్నిటి కన్నా ఉన్నత స్థాయికి చెందిన శాఖ 'లా ఇలాహ ఇల్లల్లాహ్'ను అంగీకరించటం, అన్నిటికన్నా అధమ స్థాయి శాఖ దారిలో ఉన్న బాధాకరమైన వస్తువును తొలగించటం. బిడియం (హయా) కూడా విశ్వాసం(ఈమాన్) లోని ఒక విభాగమే." (ముస్లిం)

సత్కార్యాల సీజన్ వచ్చినపుడు ఒక ముస్లిం లోని ఆంతర్యంలో మంచి పనులు చేయాలన్న ఆరాటం మొదలవుతుంది. దైవవిధేయతా భావం తొణికిసలాడుతుంది. అదేవిధంగా పాప కార్యాలు జరిగిపోయినపుడు మనసులో ఉదాసీనత ఆవరిస్తుంది. బద్ధకం, నిర్లిప్తత చోటు చేసుకుంటుంది. విశ్వాసంలో హెచ్చు తగ్గులు జరుగుతుంటాయనే దానికి ఇదీ ఒక నిదర్శనమే. ఈ నేపథ్యంలో దైవ వాక్కును ఓ సారి నెమరు వేసుకోండి. "నిశ్చయంగా పుణ్య కార్యాలు పాపకార్యాలను దూరం చేస్తాయి."

(హూద్:114)

విశ్వాసం(ఈమాన్)లోని ప్రధానాంశాలు ఆరు. దైవ ప్రవక్త(స) వారు తమ హదీసులో ఈ సంగతి ప్రస్తావించారు. "మీరు అల్లాహ్‌ను, ఆయన దూతలను, ఆయన గ్రంథాలను, ఆయన సందేశహరులను, అంతిమదినాన్ని, మంచీ చెడుల విధిప్రాతను విశ్వసించాం."

(బుఖారి,ముస్లిం)

ప్రశ్న: "లా ఇలాహ ఇల్లల్లాహ్"లోని భావామృతం ఏమిటి ?

జ: దైవేతరులు దాస్యానికి, పూజాపునస్కారాలకు, మొక్కుబడులకు హక్కుదారులు కానే కారని, ఒక్కడైన అల్లాహ్ మాత్రమే వీటికి హక్కుదారుడని క్రియాత్మకంగా నిరూపించటం.

ప్రశ్న: ప్రళయ దినాన మోక్షం పొందే సమూహం ఏది?

జ: దేవుని అంతిమ ప్రవక్త(స) ఈ విధంగా చెప్పారు: "నా అనుచర సమాజం 73 వర్గాలుగా చీలిపోతుంది. వాటిలో ఒక్కగానొక్క సమూహం తప్ప మిగితావన్నీ నరకానికి పోతాయి. 'దైవప్రవక్తా(స)! ఇంతకీ ఆ సమూహం ఏది? అని ఒక సహచరుడు ప్రశ్నించగా "అది నా విధానాన్ని, నా సహవాసుల విధానాన్ని అనుసరించే సమూహం" అని ఆయన(స) వివరించారు. (అహ్మద్,తిర్మిజీ)

కాబట్టి మన ప్రవక్త(స) వారు, ఆయన ప్రియ చరులు(ర) నడచిన బాటే రాచబాట! అదే సత్య మార్గం! అదే రుజు మార్గం! అందుచేత మీరు ముక్తి మార్గాన పయనించాలనుకుంటే, మీ కర్మలు దైవసన్నిధిలో స్వీకారయోగ్యం కావాలన్నదే మీ మనోరథమైతే మీరు మహా ప్రవక్త(స)ను అనుసరించక తప్పదు. ప్రవక్త (స) విధేయతే పరమావధి. ప్రవక్త(స) అడుగు జాడల్లో నడవాలంటే ధర్మంలో లేనిపోని ఆచారాలను విడనాడాలి. కొత్తపుంతల (బిద్అత్)కు దూరంగా ఉండాలి.

ప్రశ్న: ఏమిటి, అల్లాహ్ మన వెంట ఉన్నాడా ?

జ: అవును, జ్ఞానం దృష్ట్యా మన వెంట ఉన్నాడు, మనం చెప్పేది వింటున్నాడు. మనం చేసేది చూస్తున్నాడు, క్షణంక్షణం మనల్ని కాపాడుతున్నాడు. తన ప్రణాళికననుసరించి, తన శక్తియుక్తులననుసరించి అల్లాహ్ మనకు తోడుగా ఉన్నాడు. అయితే...ఆయన అస్థిత్వం సృష్టితాల(ప్రాణుల) అస్థిత్వానికి విలక్షణమైనది. అస్థిత్వం దృష్ట్యా ఆయన మన వెంట ఉండడు. ఈ విషయం మరే యితర జీవరాశికీ అంతుబట్టనిది.

ప్రశ్న: కళ్ళతో అల్లాహ్‌ను చూడగలమా?

జ: ఈ ప్రాపంచిక జీవితంలో అల్లాహ్‌ను చూడటం సాధ్యం కాదు. ఈ విషయంలో సమస్త ముస్లింల మధ్య ఏకాభిప్రాయం ఉంది. అయితే ప్రళయదినాన అల్లాహ్ అందరినీ సమీకరించిన మహ్‌షర్ మైదానంలోనూ, స్వర్గంలోనూ ముస్లింలకు తమ ప్రభువైన అల్లాహ్ దర్శనభాగ్యం లభిస్తుంది. ఈ విషయమై అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

"ఆ రోజు ఎన్నో ముఖాలు తాజాగా (ఆహ్లాదకరంగా) ఉంటాయి. తమ ప్రభువు వైపు చూస్తూ ఉంటాయి".

(అల్ ఖియామా:22,23)



సహనమంటే...

– శాంతి ప్రియ

సహనమంటే సత్య ప్రవక్తలది
సహనమంటే దయార్ద్ర హృదయులది
సహనమంటే భువనగగనాలది
ఈ సుగుణం పురుషోత్తములకాభరణం

భగ్గుభగ్గున మండిపోతున్న అగ్ని
రవ్వల మధ్య పడక వేసుకుని కూర్చుని
నిప్పుకే సవాలు విసురుతున్న
ఇబ్రాహీమ్ సహనం శ్లాఘనీయం

మల్లెల్లాంటి లేత బుగ్గల బాలుణ్ణి
నడి రేయి కన్న కలలకి ప్రతిగా
మినా మైదానం మధ్యలో గుండె
రాయి చేసుకుని గొంతు కోసేందుకు
సిద్ధమవుతున్న ఆ తండ్రి సహనానికి జోహార్లు
పితృ వాత్సల్యానికి పరవశించిపోతూ ప్రభువు
ప్రసన్నత కోసం పరితపించిపోతున్న ఆ
పుత్రుని పరమ సహనం నిరుపమానం

ఉక్కు రంపం తన దేహాన్ని
చీల్చుకుంటూ తెగ సాగుతున్నా
శరీరం రెండు ముక్కలయి లెక్క
లేనంత బాధ కలుగుతున్నా కెరటాల్లా
దుఃఖం ఉప్పొంగుతున్నా సహిస్తూ సత్యమే
పలికిన జకరియా సహనం ప్రశంసనీయం

రాళ్ళు రువ్వి నరాల్ని చిట్లగొడుతున్నా మేకులు
దించి నాడుల్ని తెంపేస్తూ నరరూప రాక్షసుల్లా
వికటాట్టహాసం చేస్తూ వేదనకు గురి చేస్తున్నా
తనువు నిండా కరుణ నింపుకుని చల్లని దీవెనతో
మందస్మిత మోముతో మమతల్ని మరిపించే
ఈసా వారి సహనం అమేయం.

ప్రవక్తలే ఒక బీజమైతే మహా ప్రవక్త
ముహమ్మద్ ఒక సంజీవ రూపం
ప్రవక్తలే ఒక మూలమైతే
రసూల్ వారే మహా వృక్ష స్వరూపం
ప్రవక్తలే ఒక నెలవంకైతే
నబీ వారే పూర్ణ చంద్రం

ముహమ్మద్ (స) శాంత రూపులు, ఆయన
ప్రబోధనమే విశ్వ మానవ సౌభ్రాతృత్వం. ఆయన
దేహం సత్య కాంతం. దాని చల్లని
జ్వలనమే విశ్వకోటికి ఆదర్శం

ఎంత మృదువో ఆయన మాట, మరి అది
ఎట్టి గట్టి, కరడు గట్టిన హృదయాన్నయినా
ఇట్టే చీల్చుకుని లేస్తుంది. మృగత్వం మెడను
వంచి మానవత్వాన్ని శాఖాశిఖలతో వర్ధిల్లజేస్తుంది

ముహమ్మద్ (స)కు ఉన్న మహత్తు ఏమిటి?
నల్ల శాలువా, తెల్లపాగా, ఎండు రొట్టె
ఆయన మృదు మధుర ప్రబోధనంతోనే ది
గంతములు ప్రచలించలేదా? పరివర్తనం చెందలేదా?

ఏమి ఉన్నదీ మక్కా నగరంలో? ఏ
వేవో ఆచారాలు ఎందరెందరో విగ్రహారాధకులు
కాబా ప్రతిష్టాలయంలో 360 అప్రతిష్ట ప్రతిమలు
అచట పుట్టిన అనాథతోనే అరబ్బు దేశం
ముఖరించలేదా? ధర్మం దశ దిశల వ్యాపించలేదా?
వైమనస్యం నశించి, సౌమనస్యం వెలుగొందలేదా?
భయం భ్రాంతి వైదొలిగి శాంతి తంత్రి నినదించలేదా?
నిశ్చల పరాక్రమమున్న నిర్మ హృదయులు
మహా ప్రవక్త (స) దుర్దాంత ధీరత్వ వీర
మహిమాన్వితులు మహా ప్రవక్త (స) ఏళ్ళ
తరబడి బానిసలుగా దమించిపోతున్న దళిత
జనాల మోక్ష అరుణోదయ కిరణం మహా
ప్రవక్త ముహమ్మద్ (స) ప్రవక్తోత్తములు.



సర్వేంద్రియానం నయనం ప్రధానం - 2

కన్నీరు - ఖచ్చితమైన కన్నీటి బొట్టు



కన్నీటి బొట్టు చాలా అసాధారణమైన ద్రవం. ఇది విభిన్న అంశాలను కలిగి, వివిధ ప్రత్యేకమైన పనులకు ఉపయోగ పడుతుంది. ప్రాథమికంగా కన్నీటి బొట్టు కంటిని క్రిముల నుండి కాపాడుతుంది. కన్నీటిలో లైసోజైమ్ (lysozyme) అను జెర్మిసైడల్ ఎంజైమ్ ఉంటుంది. ఇది కళ్ళలో క్రిములు లేకుండా చేస్తుంది. మైక్రోబ్‌ను చంపే సామర్థ్యం ఈ ఎంజైమ్‌కి ఉంది. చాలా రకాల బాక్టీరియాను చిదిమి వేస్తుంది. శక్తివంతమైన లైసోజైమ్ వాస్తవానికి, మన ఇళ్ళలోని క్రిములను చంపడానికి వాడే కొన్ని రసాయనాల (కెమికల్స్) కంటే కూడా బలమైనది. ఇటువంటి ప్రభావాల ను కలిగి ఉండి, మన కళ్ళకు పూయ కలిగే కృత్రిమమైన క్రిమి సంహారి లేనే లేదు. అంతే కాకుండా మరో అద్భుతం ఏమిటంటే, అలాంటి బలమైన పదార్థం అయి ఉండి కూడా మన కళ్ళకు స్వల్ప మైన ప్రమాదాన్ని కూడా కలుగజేయదు. ఇంత సున్నితంగా ఖచ్చితమైన లెక్క ప్రకారం ఏర్పాటు చేసిన వ్యవస్థను మన కంటిలో సృష్టించిందెవరు? సర్వ శక్తి మంతుడైన అల్లాహ్ కాదా? ఖుర్‌ఆన్‌లో **ఇలా ఉంది:** **"వాస్తవంగా మేము మానవుడిని సర్వ శ్రేష్టమైన ఆకారంలో సృష్టించాము".** (అత్తీన్: 4)

చాలా దగ్గరగా పరీక్షిస్తే, ఈ కన్నీటి బొట్టు తయారీలో ఎలాంటి అద్భుతం దాగి ఉందో బాగా అర్థం చేసుకోగలుగుతాము. కార్నియా తడిగా ఉండేలా, దానిని పొడి కాకుండా రక్షించడానికి మరియు కనుగ్రుడ్డు యొక్క జారే గుణాన్ని కొన సాగించడానికి కావలసినంత కన్నీరు మాత్రమే ఖచ్చితమైన పరిణామంలోనే విడుదల అవుతుంది. ఈ విధంగా కంటిలో నీరు విడుదల అవడం వలన కనుగ్రడ్డు తిరుగుతున్నప్పుడు, దీని పై భాగానికి మరియు కనురెప్ప లోపలి భాగానికి మధ్య అసౌకర్యమైన ఘర్షణ (friction) లేకుండా ఉంటుంది.

ఒకవేళ కన్నీరు గనక కావాల్సిన మోతాదులో తయారు కాకపోతే, కనురెప్ప మరియు కనుగ్రుడ్డు మధ్య ఘర్షణ ఏర్పడి భరించరాని నొప్పి కలుగుతుంది. ఈ విధంగా జరిగినప్పుడు మన కళ్ళల్లో ఇసుక ఉన్నట్లుగా నిరంతరం మండుతున్న అనుభూతి కలుగుతుంది. కళ్ళు ఎర్రగా ఉబ్బుతాయి. మరీ ఎక్కువైతే గ్రుడ్డితనానికి దారి తీస్తుంది. ఎప్పుడైనా ఒకవేళ ఏదైనా ధూళి కణంగాని మన కళ్ళల్లో పడి చికాకు పెడితే వెంటనే ఆటోమెటిక్‌గా కళ్ళలో నీరు ఎక్కువగా తయారవుతాయి.

మరోలా చెప్పాలంటే, ఖచ్చితమైన మరియు సరైన అవయవ నిర్మాణాన్ని కలిగి ఉండే కన్నీటి గ్రంధులు ఖచ్చితంగా కావలసిన పరిణామంలోనే కంటిలో నీటిని విడుదల చేసేలా కంట్రోల్ చేస్తూ ఉంటాయి. పూర్వ కాలంలో మనిషికి కన్నీళ్ళు వచ్చాయి. ఇప్పుడూ మనిషికి కన్నీరు వస్తుంది. అవి మనిషి నుండి మనిషికి మారవు. ఖురాన్‌లో ఇలా ఉంది: **"ఆయన (అల్లాహ్) తన ఇష్టాను సారంగా మిమ్మల్ని (మాతృ) గర్భాలలో తీర్చిదిద్దుతాడు. ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయన సర్వ శక్తి మంతుడు, మహా వివేకవంతుడు".**


(ఆలి ఇమ్రాన్: 6)

చూపు ఎలా కూర్చబడుతుంది?

పుట్టినప్పటి నుంచి మనిషి చూసే ప్రతీ దృశ్యం కూడా మెదడులో కొన్ని ఘనపు సెంటీ మీటర్ల పరిమాణంలో ఉండి, కంటి చీకటి మరియు తేమగా ఉండే వాతావరణంలో ఉండే 'దృశ్య కేంద్రం' (visual centre)గా పిలువబడే ప్రదేశంలో కూర్చబడుతుంది.

చిన్న గదియొక్క దృశ్యాలే కాకుండా సువిశాలమైన ప్రకృతి దృశ్యాలు కూడా ఏర్పడేవి మెదడులోని ఈ చిన్న ప్రదేశం లోనే. మన సొంతమైనవి, మన బాల్యం, మనం వెళ్ళిన స్కూలు, మన ఇండ్లు, పని, కుటుంబం, దేశం, క్లుప్తంగా మనం చూసిన ప్రతీ చిన్న వివరం–అన్నీ కూడా మెదడులోని చిన్ని భాగంలోనే ఉంటాయి.

మన చూపులో మొదటి దశ



కాంతి కిరణాలు మన కళ్ళల్లోకి ప్రవేశించి కార్నియా, కనుపాప మరియు లెన్స్ (కటకాల) ద్వారా కంటి లోపలికి ప్రయాణిస్తాయి. రెటీనాలోని కాంతికి ప్రభావితమయ్యే కణాలు, ఆ కాంతిని ఎలక్ట్రికల్ సంకేతాలుగా మార్చి మెదడుకు పంపుతాయి. రెటీనా నుంచి వచ్చే దృశ్యం తలక్రిందులుగా ఉంటుంది. కాని మెదడు ఈ దృశ్యాన్ని సరియైన విధంగా తిరగ వేస్తుంది. ప్రతీ కన్ను నుండి వచ్చే సంకేతాలలో వస్తువుకు సంబంధించి గ్రహించిన దృశ్య వివరాలు ఉంటాయి.

రెండు కళ్ళ నుండి వచ్చిన దృశ్యాలను 'మెదడు' (Brain) కలిపి, ఒకే త్రీ డైమన్షనల్ దృశ్యాన్ని తయారు చేస్తుంది. టూ డైమన్షనల్ దృశ్యానికి ఉదాహరణ ఫోటో

అయితే, త్రీ డైమన్షనల్ దృశ్యానికి ఉదాహరణ వీడియో. అంతే కాకుండా ఆ దృశ్యానికి సంబంధించిన రంగులు మరియు అది మనకు ఎంత దూరంలో ఉందో మొదలైన విషయాలను మెదడు నిర్ధారిస్తుంది. ఈ మొత్తం పని అంతా మెదడులో ఒక సెకనులో పదవ వంతు కంటే తక్కువ సమయంలోనే జరుగుతుంది. సుబ్హానల్లాహ్!

మన కన్ను లెక్కలేనన్ని రకరకాల భాగాలతో మరియు పొరలతో తయారైంది. వీటిలో కొన్ని: కార్నియా (కంటి గుడ్డు మీద ముందు ఉండే పారదర్శకమైన గట్టి భాగం). ఐరిస్ (కంటిపాపకు చుట్టూ ఉండే నల్లని పొర). పుపిల్ (కనుపాప). లెన్స్ (కనురెప్ప), రెటీనాను మెదడుకు కలిపే నరాలు మరియు లెక్కలేనన్ని ఇతర నిర్మాణాలు. ఇవన్నీ కలిసి ఒకేసారి మొత్తంగా మాత్రమే పని చేస్తాయి. కళ్ళు వేటినైనా చూడాలంటే, పై నిర్మాణాలను మరియు అదే సమయంలో టిష్యూలను కూడా కలిగి ఉండాలి. అవి ఖచ్చితంగా మరియు సంపూర్ణంగా ఏక కాలంలో ఒకేసారి పని చేయాలి. ఈ వ్యవస్థలన్నింటిని సృష్టించి, వాటి మధ్య గొప్ప సామర్థ్యాన్ని ఏర్పాటు చేసిన అల్లాహ్ సర్వ శక్తిమంతుడు. ఖుర్ఆన్‌లో ఇలా ఉంది: **"ఆయనే ఆకాశాలనూ మరియు భూమినీ ఏమీ లేని శూన్యం నుండి సృష్టించినవాడు. మరియు ఆయన ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నప్పుడు దానికి కేవలం – 'అయిపో!' అని ఆజ్ఞాపిస్తాడు. అంతే అది అయిపోతుంది".** (బఖరా: 117)

మనం ఏమైతే చూస్తున్నామో వాటి గురించి తెలుసుకోవడం

మానవుని మెదడులో తను చూసే దృశ్యాలు దాచ బడతాయి. ఈ విధంగా మెదడులో దాచబడిన సమాచారాన్ని మరలా ఉపయోగించుకోవడానికి జ్ఞాపకం చేసుకోవడం జరుగుతుంది. మనం ఏదైనా ఓ వస్తువుని గాని, ఓ వ్యక్తిని గాని మొదటి సారి చూసినప్పుడు ఉదాహరణకు ఆ వస్తువు లేదా వ్యక్తి కొరకు మన మెమోరీ (జ్ఞాపక శక్తి)లో ఓ కొత్త ఫైల్ ఓపెన్ అవుతుంది. ఆ తర్వాత ఎప్పుడైనా అదే దృశ్యాన్ని మరలా మనం చూసినప్పుడు మన జ్ఞాపక పొరలలోనున్న ఫైల్ తిరిగి తెరచుకుని, ఆ ఫైల్‌లో భద్రపరచబడిన దృశ్యంతో, ఈ దృశ్యాన్ని పోల్చి చూసుకుంటుంది.

ఉదాహరణకు మన్‌మోహన్‌సింగ్ గారిని మొదటిసారి చూసినప్పుడు ఆయన యొక్క ఫోటో మన మెదడులో మన్‌మోహన్‌సింగ్ గారి పేరు మీద రికార్డ్ అవుతుంది. ఆ తర్వాత మరెప్పుడైనా ఆయనను చూసినపుడు మన మెదడులోని ఫైల్‌లో ఉన్న మన్ మోహన్‌సింగ్ గారి ఫోటోతో పోల్చుకోవడం జరుగుతుంది. పోలిక సరిపోతే మనం చూసే వ్యక్తి మన్‌మోహన్ సింగ్ అని మనకు తెలుస్తుంది.

ఈ విధంగా మనం చూసే దృశ్యాలను మన మెదడు నిర్ధారిస్తుంది. ఈ విధంగా జరగడం మానవులందరిలోనూ ఆటోమెటిక్‌గా జరిగిపోతుంది. చిన్నపిల్లల నుండి పెద్దల వరకూ ఈ వ్యవస్థ అందరి మెదళ్ళలోనూ ఒకే విధంగా పని చేస్తూ ఉంటుంది.



మనకు తెలియకుండా జరుగుతున్న ఇటువంటి పనుల గురించి మనకు ఎప్పుడు స్పష్టంగా తెలుస్తుంది? మన మెదడులోని ఈ వ్యవస్థ పనిచేయకుండా ఆగిపోయినప్పుడు మాత్రమే తెలుస్తుంది.

(ఈ విషయం అర్థం కావడానికి వీడియోలో చూపబడిన ఓ సన్నివేశం గురించి ఇక్కడ వర్ణిస్తున్నాము.)

డాక్టర్ చూపిస్తున్న ఫోటోలను గుర్తు పట్టడానికి ఓ ముసలాయన ప్రయత్నిస్తున్నాడు. ఈయన కొద్ది క్షణాల క్రితం చూసిన దృశ్యాలు కూడా అతని మెదడులోని జ్ఞాపకాల నుండి మాయమవుతున్నాయి. అంటే కాసేపటి క్రితం చూసిన వాటిని కూడా మర్చిపోతున్నాడు.

"ఈ ఫోటోలలో కన్పిస్తున్న వ్యక్తి తెలిసిన వాడులా అనిపిస్తున్నా సరే, ఆయనెవరో నాకు తెలియదు. తనెవరో నేను చెప్పలేను."

ఆ విధంగా ఆయన గుర్తు పట్టని వ్యక్తులలో ఆయన భార్య కూడా ఉంది. ఆమె అతనితో 48 సంవత్సరాలుగా కాపురం చేసింది కూడా. అలాగే కొద్ది సేపటి క్రితం తన చేతిలో చేతినుంచుకుని నడిపించుకుని తీసుకుని వెళ్ళిన తన మనుమడిని కూడా అతను గుర్తుపట్ట లేదు. ఇంతకీ జరిగిందేమిటి? అంటే, మనుష్యుల ముఖాలను కనుగొనే శక్తిని, తనకు జరిగిన బ్రెయిన్ ఆపరేషన్ ఫలితంగా ఈయన కోల్పోయాడు. ఆయన యొక్క ఈ పరిస్థితిని స్వయంగా ఆయన యొక్క మాటలలోనే తెలుసుకుందాం. **"ఒక షాపు ముందు ఇద్దరు స్నేహితులతో నా కుమారుడు నిలుచున్నప్పుడు, వారి ముఖాలను నేను గుర్తు పట్టలేక పోతున్నాని నేను గ్రహించడమే మొదటి ఉదాహరణ. "ఆ ముగ్గురిలో కనీసం ఒక్కరి గురించి నేను తెలుసుకోవాలి. అందుకోసం వారివైపు నడచివెళ్తూ వారి ముఖాలను అధ్యయనం చేస్తున్నాను. వారి మధ్యలోని ఒకరు 'హాయ్ డాడ్' అని పిలిచే వరకూ, వారిలో ఎవరు నా కొడుకో నాకు ఐడియా లేకుండా పోయింది".**

ఎవరినైనా కనుగొనడానికి ప్రయత్నించడం పెద్ద విషయం కాకపోయినా, వారు నాకు ఎంత బాగా తెలుసు అనే విషయం తెలియడం నాకు అసాధ్యమైన పని అయిపోయింది. నేను పిల్లల కోసం బీచ్‌కి వెళ్ళ వలసి వస్తుంది. అంతపరకూ బాగానే ఉంటుంది. ఆ బీచ్‌లోని అంతమందిలో నా పిల్లలిద్దరినీ కనుగొనడం ఎలా? ఇతని కొడుకు తన తండ్రి యొక్క ఆరోగ్యలోపాన్ని ఈ విధంగా వర్ణించాడు. "మీరు నా ముఖాన్ని చూసినప్పుడు, నా మొత్తం ముఖాన్ని ఒకే పిక్చర్‌గా చూడగలుగుతారు. (అలా చూడటంలో) నా చెవులు చిన్నవా? పెద్దవా? చిన్న ముక్కా? లేదా నా కళ్ళ యొక్క రంగు ఏమిటో మీరు చూడగలరు. (కాని) ఈయన మిమ్మల్ని చాలా దగ్గరగా చూడ వలసి వస్తుంది. ఈయన మీ ఎడమ కన్నును చూడగలడు, ఆ తర్వాత మీ ముక్కును చూడగలడు, మీ పెదవులను మరియు మీ నోటిని చూడగలడు. కాని ఈయన సమస్య ఏమిటంటే, ఇలా విడి విడిగా చూసిన వీటన్నింటినీ ఒకేసారి ఒకే పిక్చర్‌లో పెట్టలేడు." అంటే మీ ముఖంలో భాగాలను చూడగలడు గాని ఒకేసారి మీ ముఖాన్నంతటినీ చూసి పోల్చుకోలేడు. **(ఇంకా ఉంది)**

హ్యూ పీరిమేకర్



జగమంతా జనాభా

➥ప్రస్తుత ప్రపంచ జనాభా యునైటెడ్ స్టేట్ సెన్సస్ బ్యూరో లెక్కల ప్రకారం 693 కోట్లు దాటింది. ఇది 1900లో 105 కోట్లు ఉంటే 1960లో మూడొందల కోట్లకు చేరింది. 900 నుంచి 2000 సంవత్సరాల మధ్య వందేళ్ళలోనే ఈ పెరుగుదల 400 శాతంగా నమోదయింది. 2050 సంవత్సరానికి
ప్రపంచ జనాభా 705 కోట్ల నుంచి వెయ్యి కోట్ల మధ్య ఉండే అవకాశం ఉందని అంచనా.

➥ఇక, మొత్తం జనాభాలో 60 శాతం ఆసియాలోనే ఉన్నారు. (అందులో చైనా భారత్‌లో ఉన్న జనాభా 37 శాతం), ఆఫ్రికా 15 శాతం, యూరప్ 11%, లాటిన్ అమెరికా, కరీబియన్ ప్రాంతాలు కలిపి 9%, ఉత్తర ఆమెరికా 5%, ఓషియానియా 0.5 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

➥సీఐఏ వరల్డ్ ఫ్యాక్ట్ బుక్ 2009 అంచనాల ప్రకారం ప్రపంచంలో రోజుకి సుమారు 2.20 లక్షల మంది జన్మిస్తున్నారు. మరణాల రేటు సెకనుకి 1.84 ఉంటే జననాల సంఖ్య 4.3 ఉంది. జనాభా వృద్ధి రేటు సెకనుకి 2.46.

➥ప్రపంచంలో అతి ఎక్కువ జనాభా (134.4 కొట్లు)తో చైనా ముందుంది. 121కోట్ల జనాభాతో తర్వాతి స్థానం మన దేశానిదే.
అతి తక్కువ జనాభా గల దేశం వాటికన్ సిటీ (800 మంది). 2006 సీఐఏ వరల్డ్ ఫ్యాక్‌బుక్ట్ నివేదికల ప్రకారం మొత్తం జనాభాలో 27 శాతం 15 ఏళ్ళ లోపువారే.

➥భారత దేశ విషయానికొస్తే, మన దేశం మొత్తం జనాభా 121 కోట్లయితే పురుషుల సంఖ్య 62.37 కోట్లు. స్త్రీల సంఖ్య 58.65 కొట్లు. స్త్రీపురుషుల నిష్పత్తి చూస్తే 940 మంది మహిళలకు వెయ్యి మంది పురుషులున్నారు. (దీన్ని బట్టి భ్రూణ హత్యలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో విదితమతుంది.) 1947లో మన జనాభా 35కోట్లు. 2001లో 102 కోట్లు. మన దేశ జనాభా ఆమెరికా, ఇండోనేషియా, బ్రెజిల్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, జపాన్ దేశాల మొత్తం జనాభాకు సమానం. గత పదేళ్ళలో మన జనాభా 18 కోట్లు పెరిగింది. మన జనాభాలో 72.2 శాతం గ్రామాల్లో నివసిస్తున్నారు. 19.9 కోట్ల జనాభాతో ఉత్తర్ ప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉంటే, ఆంధ్రప్రదేశ్ (8.46 కోట్లు)తో అయిదవ స్థానంలో ఉంది. 64,429 మంది జనాభాతో లక్షద్వీప్ ఆఖరి స్థానంలో ఉంది.

➥అతి ఎక్కువ జనసాంద్రత (చదరపు కిలోమీటరుకి 37,346 మంది నివసిస్తున్నారు.) గల ప్రదేశం ఢిల్లీలోని నార్త్‌ఈస్ట్ జిల్లా. అరుణాచల్ ప్రదేశ్‌లోని డిబాంగ్ వ్యాలీ అతి తక్కువ జనసాంద్రత (చదరపు కిలోమిటరుకి ఒక్కరే నివసిస్తున్నారు) గల ప్రదేశం.

➥బాలబాలికల నిష్పత్తి చూస్తే వెయ్యి మంది అబ్బాయిలకు 914 మంది అమ్మాయిలు మాత్రమే మన దేశంలో ఉన్నారు. మీజోరాంలో ఈ సంఖ్య వెయ్యి మంది అబ్బాయిలకు 971, మేఘాలయలో 970. హర్యానాలో అత్యల్పంగా 830 మందీ, పంజాబ్‌ల 846 మంది అమ్మాయిలున్నారు. మన దేశంలో నిమిషానికి 51 మంది శిశువులు పూపిరి పోసుకుంటున్నారు.

➥2050 నాటికి భారత్ జనాభా చైనాను అధిగమించి ప్రపంచంలోనే అత్యధిక జనాభా గల దేశంగా అవతరిస్తుందని నిపుణుల అంచనా. అందుక్కారణం గత ఐదేళ్ల నుంచి భారత జనాభా వృద్ధి రేటు 1.4 శాతం అయితే చైనాది 0.6 శాతమే. ప్రస్తుత మన జనాభాలో 50 శాతం 25 ఏళ్లలోపు వారే. 35 ఏళ్ల లోపు వాళ్లు 65 శాతం ఉన్నారు. **(ఈనాడు 10-07-011 సౌజన్యంతో)**

మేధకు మేత

➥చంద్రుడు భూమి చుట్టూ తిరిగేసరికి ఒక నెల అవుతుంది.

➥సూర్య కిరణాల (వెలుగు) వేగం ఒకక్ష ణానికి 186 వేల మైళ్ళు.

➥సూర్య కిరణాలు భూమికి చేరే సరికి 8 నిముషాలు పడుతుంది.

➥భూమండలంలో హత్య చేయబడిన తొలివ్యక్తి హాబీల్ బిన్ ఆదమ్.

➥ఉమర్ బిన్ ఖత్తాబ్(ర) ఖడ్గం పేరు వష్షామ్.

➥ కలంతో రాసిన మొదటి వ్యక్తి ఇద్రీస్(అ)

➥భూమండలంలో మొట్టమొదటి సారి నిర్మించబడిన ప్రార్థనాలయం కాబా ప్రతిష్ఠాలయం.

➥ప్రపంచాన్ని పరిపాలించిన నలుగురు వ్యక్తులలో ఇద్దరు విశ్వాసులు.(1) జుల్ ఖర్నైన్ (2) సులైమాన్ (అ) ఇద్దరు అవిశ్వాసులు(1) నమ్రూద్ (2) బొఖ్ఖ నస్సర్.

➥ప్రపంచపటం మొట్టమొదటి సారి తయారు చేసిన వ్యక్తి అబూ అబ్దుల్లాహ్ బిన్ అల్ ఇద్రీసీ.

➥ఇస్లాంలో అల్లాహ్ మార్గంలో ప్రాణాలర్పించిన తొలి మహిళ సుమయ్య(ర)

మంచి మాటలు

➥పైపై ఆకారాలు చూసి మంచి చెడ్డలు నిర్ణయించకండి, అలా చేసేవారు కేవలం సంకుచిత స్వభావులు. (ఆస్కార్ వైల్డ్)

➥మన శరీరాలు మన పూదోటలు, మన మనసులు, మన అభీష్టాలు వాటికి తోటమాలీలు..నిస్సారంగా విడిచి పెట్టవచ్చు లేదా పరిశ్రమతో పండించుకోవచ్చు. (షేక్స్‌పియర్)

➥విజయం సాధించగలమనే విశ్వాసం ఉన్నవాళ్ళు విజయం సాధించి తీరుతారు. (డబ్యు.ఎమర్సన్)

➥ఇద్దరి మధ్య వైరం సంభవించిందంటే అందుకు వారిలో ఒక్కరే కారణం కావచ్చు. కాని అది దీర్ఘకాలం సాగిందంటే ఇద్దరూ బాధ్యులే. (థామస్ పుల్లర్)

➥ఎవరైనా కోపం తెచ్చుకోగలరు, అది సులభమే, కాని సరియైన వ్యక్తిపై సరియైన స్థాయిలో,సరియైన సమయంలో, సరియైన ప్రయోజనం కోసం, సరియైన విధానంలో కోపగించ డం మాత్రం అందరికీ సాధ్యం కాదు. అంత తేలికా కాదు.

(అరిస్టాటిల్)



ముహమ్మద్ సలీమ్ జామయీ



అందరూ యోధులే జీవిత సమరంలో
కొందరు అగ్రసరులు
కొందరు అనుచరులు

నమ్మకం వేరు నడక వేరు
ప్రసంగిస్తారు పలువురు సాగరాల్లా
జీవిస్తారు పాడు బురద గుంటల్లా

తప్పుకుంటాను నేను
గంభీరతనూ, సుకుమారతనూ
భీరుత అనేవాళ్ళ నుంచి
వాచాలతను వివేకంగా
మౌనాన్ని అజ్ఞానంగా
భావించేవాళ్ళ నుంచి

కొందరు చెవులతో వింటారు
కొందరు పొట్టతో వింటారు
కొందరు జేబులతో వింటారు
మరికొందరు విననే వినరు

'నీ శత్రువును ప్రేమించ'మని
నా శత్రువు చెప్పగా విని;
అక్షరాలా పాటించాను
నన్ను నేనే ప్రేమించాను

తన అశ్రుధారలో తానే తడిసిన వాడు
మునుముందు స్వచ్ఛంగా మనగలుగుతాడు

ధనం –
కుహనా ప్రణయానికి బీజం
మృషా సౌభాగ్యానికి మూలం
విషాక్త జలమయ రూపం
వార్ధక్య పరిపీడన ధూపం

ధనాన్ని కోరుతుంది ధనం
దాని పర్యవసానం –
అశాంతి, ఆవేదన.

జడప్రాయంగా ఉన్న
అమిత జ్ఞానం కన్నా
చైతన్య రూపంలో ఉన్న
పరిమిత జ్ఞానం మిన్న

అసలైన జాతీయ సంపద
పసిడిలో లేనే లేదు
విద్యలో ఉంది, వివేకంలో ఉంది
అనవద్యమైన ఆర్జవంలో ఉంది

పంజరంలో ఉన్న పక్షి కట్టుకోదు గూటిని
తన పిల్లలకాగూడు పంజరం ఔతుందని

పసిడి కూడబెట్టుకునే
పిసినగొట్టు జీవితం
సమాధిలో లుకలుకమను
క్రిములకు రూపాంతరం

ఆత్మను ఆకర్షించేదే
ఆసలైన అందం
అందుకోవడం కాదు
అందివ్వడమే దాని చందం

ఏదీ మన భయానక లోపం
ఇతరుల లోపాలు ఎన్నడం

మూలం– ఖలీల్ జిబ్రాన్
తెలుగు రూపం– సినారె

➥నీవు బాధ పడకుండా జీవించాలంటే విద్యనభ్యసించు. ఆచరణతో ప్రేమ పుడుతుంది.
➥ప్రయాణానికి ముందు ప్రయాణ మిత్రుడ్ని ఎంచుకో
➥సంభాషణ రజతం అయితే మౌనం స్వర్ణం
➥నీవు మేలు చేసిన వాడి కీడు నుండి జాగ్రత్తగా ఉండు.
➥చెడు బీజం నాటినవాడు అవమానాన్ని ఫలంగా పొందుతాడు.
➥ఇహం కోసం పరాన్ని అమ్మినవాడు రెంటినీ కోల్పోతాడు.
➥ఆచరణ లేని విద్య ఫలమివ్వని చెట్టు వంటిది.
➥జీవించడానికి శ్రమించక తప్పదు.
➥చెడపకురా చెడేవు.

నవ నాడులను ఉత్తేజపరిచేది నవ్వు

ఒక ఖైదీ జడ్జీ దగ్గర ఇలా విన్నవించుకున్నాడు – అయ్యా! నాకు తిన డానికి అన్నం లేక, ఉండటానికి నివాసం లేక, పలుకరించే స్నేహితులు లేక, చేసుకోవడానికి ఏ పని దొరక్కా ఈ నేరం చేశాను, మన్నించ గలరు' అని.

జడ్జీ: అవును నిజంగా నీ పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. అందుకే న్యాయస్థానం నీకు తినడానికి అన్నం, ఉండటానికి నివాసం, కబుర్లాడటానికి స్నేహితులు, పని సౌకర్యాన్ని రెండు సంవత్సరాల వరకు కల్పిస్తున్నది. అయితే ఆ రెండు సంవత్సరాలు నీవు జైల్లో ఉండాలి సుమా! అన్నాడు.

6వ పేజీ తరువాయి భాగం....

ఆయన(స) సమస్త మానవుల సాఫల్యం కోసం, ముక్తి కోసం పంపబడిన ప్రవక్త. కాబట్టి ఇప్పుడు సన్మార్గం మరియు మోక్షం అనేవి యూద మతంలోగానీ, క్రైస్తవ మతంలో గానీ,వేరితర మతాలలో గానీ లేదు. మోక్షం అనేది ఏ మతధర్మంలోనయినా ఉంది అంటే అది ఇస్లాం లోనే. ఇస్లాం ధర్మాన్ని ఆశ్రయించి, దానిని ఖచ్చితంగా అవలంబించిన వారు మాత్రమే మోక్షం పొందుతారు. ఈ ఆయతులోనూ, ఇంతకు ముందు వచ్చిన ఆయతులోనూ ముహమ్మద్(స) నిరక్షరాసి అయిన ప్రవక్త (నబీయే ఉమ్మి)గా వ్యవహరించ బడ్డారు. ఇది ఆయన ప్రత్యేకత లలో ఒక ప్రత్యేకత. ఉమ్మీ అంటే చదవటం, వ్రాయటం రానివాడు అని అర్థం. ఆయన ఏ బడికీ వెళ్ళ లేదు. ఏ అధ్యాపకుని ముందూ చదువుకోవటానికి కూర్చోలేదు. ఏ పలకపైనా అక్షరాలు దిద్దలేదు. అయినప్పటికీ ఆయన (స) అద్భుతమైన, అద్వితీయమైన ఖుర్‌ఆన్‌ను సమర్పించారు. ఆయన (స) ప్రవచనాలు, శిక్షణలు యావత్తు విద్యా జగత్తునే ఆశ్చర్యంలో ముంచెత్తాయి. ఏ కవిపుంగవుడూ, మరే సాహితీ వేత్తా, ఇంకా ఏ మేధావీ చెప్పని వివేకవచనాలు ఆయన (స) నోట జాలు వారాయి. అటువంటి దివ్య వచనాలను, సమస్త మానవాళినీ అంధకార లోయల్లో నుంచి కాంతి శిఖరాల ఉన్నతికి చేర్చే నీతి సూత్రాలను ఒక దైవప్రవక్త మాత్రమే అందించగలుగుతాడు.

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

ఆసిమా బ్రాంచ్ ఆధ్వర్యంలో 'మేరాజ్ సందేశం'



ఐపిసి ఆసిమా బ్రాంచ్ తెలుగు సెక్షన్ ఆధ్వర్యంలో 01-07-2011 వ తేదీ శుక్రవారం నాడు మేరాజ్ (గగన విహారం) శుభ సందర్భాన్ని పురస్కరించుకొని ఓ కార్యక్రమం నిర్వహించబడింది. సోదరులు అబ్దుల్లాహ్ అచారి గారి ఖుర్ఆన్ పారాయణంతో ప్రారంభమయిన ఈ కార్యక్రమం మేరాజ్ సందేశం అన్న అంశపై ప్రదర్శించబడిన పవర్ పాయింట్‌తో ముగిసింది. అలాగే ఈ సందర్భంగా న్యూ ముస్లింలు సూఫ్ షర్క్‌నూ కూడా సందర్శించారు. **నెలవంక** ఎడిటర్ సయ్యిద్ అబ్దుస్సలాం ఉమ్రీ, పూర్తి ఈ కార్య క్రమానికి రథసారధిగా వ్యవహరించారు.









మూర్తీభవించిన దాత్రుత్వం మూగబోయింది



కువైట్‌లో వివిధ సామాజిక సేవలు అందించడంలో ఎప్పుడూ ముందుండే వ్యక్తుల్లో డాక్టర్ అహ్మద్ అబ్దుల్ అజీజ్ యూసుఫ్ అల్ ముజైనీ కూడా ఒకరు. **'జమాఅత్ అన్సారుష్ షూరా వస్సలామ్'** అనే సంస్థ ప్రధాన అధ్యక్షులుగా వ్యవహరించిన ఈయన తన నిరుపమాన నైపుణ్యతతో అనేక పుస్తకాలు వ్రాశారు. వాటిలో **'అల్ ముర్షిద్ ఫీ అహ్కామిజ్ జకాత్ వల్ మవారిద్ అల్ మాలియ్యా ఫిల్ ఇస్లాం' అల్ మర్‌అతుల్ కువైతియా ఇలా ఐన?' అల్ కువైత్ వ తారీఖుహల్ బహ్రీ'** ముఖ్యమైనవి. అలాగే ఆయన స్థాపించిన వాటిలో 'మబర్రా అల్ బిర్రిల్ ఖైరియ్యా' చెప్పుకోదగ్గది. ఈ మబర్రా ద్వారా అనేక మంది లబ్ధి పొందారు. పొందుతున్నారు కూడా. అటువంటి గొప్ప వ్యక్తి 02-06-2011 తేదీన కన్ను మూసి, అల్లాహ్‌కు ప్రియమయ్యారు. అల్లాహ్ ఆయన పొరపాట్లను మన్నించి, ఆయనకు జన్నతుల్ ఫిర్‌దౌసిల్ ఆలాలో చోటు కల్పించు గాక! ఆమీన్.



నేటి బాలలే రేపటి పౌరులు - 16

- అబుల్ తాసన్

క్విజ్ ప్రోగ్రామ్ - పేపర్ పరీక్ష

ఇది కాస్త నూతన విధానం. అలీ పిల్లలందరినీ ఐదు గ్రూపులుగా విడదీశాడు. ప్రతి గ్రూపులో ఐదుగురు ఉండేలా చూశాడు. వారిని దూరం దూరంగా కూర్చోబెట్టాడు. అబ్బాస్ ప్రతి గ్రూపుకి ఓ పరీక్ష పేపర్ ఇచ్చాడు. విధానం – ఓ గ్రూపులో ఉన్న ఐదుగురు పరస్పరం సలాహా సంప్రదింపులతో సరైన సమాధానాలు తెలుసుకొని జవాబు వ్రాయాలి. "విశ్వాసులు తమ వ్యవహారాలను పరస్పర సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకుంటారు". అన్న దైవ వచనం దృష్ట్యా ఈ విధానాన్ని ప్రత్యేకంగా పిల్లల కోసమని అలీ ప్రవేశ పెట్టాడు. పరీక్ష పేపరు ఇలా ఉంది–

క్రింది ప్రశ్నలకు జవాబు వ్రాయండి

- ఆదం (అ) దేంతో సృజించబడ్డారు?
- ఈ ధరిత్రిపై తొలి దైవ ప్రవక్త ఎరు?
- ప్రజల అవసరాల్ని తీర్చే శక్తి ఎవరికుంది?
- 950 సంవత్సరాలు దైవ ధర్మం వైపు పిలిచిన ప్రవక్త ఎవరు?
- దైవ దూతలు హజ్రత్ ఇద్రీస్ (అ) పట్ల తమ ఆశ్చర్యాన్ని ఎందుకు కనబర్చారు?
- అల్లాహ్ హజ్రత్ ఇద్రీస్ (అ) గారిని ఉత్తమ స్థానం ఎందుకు ప్రసాదించాడు?
- 'కాబా'ను మళ్ళీ నిర్మించిందెవరు?
- హజ్రె అస్వద్ ఎక్కడి నుంచి తేబడింది?
- గుర్రంపై స్వారీ చెసిన తొలి వ్యక్తి ఎవరు?
- నీటి ఊట ఉబికినప్పుడు హజ్రత్ హాజిరా ఏమని చెబుతూ ఆపారు?

రైటా....రాంగా?

- హజ్రత్ ఇద్రీస్ పాఠశాలలో చదువుకున్నారు ( )
- అల్లాహ్‌కు విధేయత చూపేవారు, శాంతియుతంగా జీవిస్తారు.( )
- హజ్రత్ ఇస్మాయిల్ (అ) జిబహ్ అవ్వడానికి సిద్ధమయ్యారు. ( )
- ఫిర్‌ఔన్ హజ్రత్ మూసా (అ)ను విశ్వసించాడు ( )
- నమ్రూద్ కుంటి దోమ వల్ల మరణించాడు ( )
- మూసా (అ) సముదాయం అల్లాహ్‌ను వదలి గోవును పూజించారు ( )
- షుఐబ్ (అ) జాతి వారు సరిగ్గానే తూచి ఇచ్చేవారు ( )

జోడించండి

హజ్రత్ ఇద్రీస్ (అ)	– సూర్యచంద్రుల్ని
ఫిర్‌ఔన్ నేనే అనే వాడు	– నిప్పులు
కారు మేఘాలు వారిపై కురిపించాయి	– దైవాన్ని
ఇబ్రాహీమ్ జాతి ప్రజలు పూజించేవారు	– భూమి దద్దరిల్లింది
భూకంపం వల్ల	– లెక్కలు

ఈ పరీక్ష పేపర్లు పిల్లల చేతిలో పెట్టి 'అబ్బాస్' ఇలా అన్నాడు: పిల్లలూ! ఈ పేపర్‌ని పరస్పర చర్చాగోష్ఠితో సాల్వ్ చేయండి. పిల్లలు ఎంతో ఆసక్తితో ఆనందంతో జవాబులు వ్రాసి సమయానికన్నా ముందే ఇచ్చేశారు. అలీ ఓ మూల కూర్చోని ఆ పేపర్లను చెక్ చేసుకుంటున్నాడు. ప్రశ్నలు సమాధానాల కార్యక్రమం మొదలయింది.

పిల్లలందరిని ఆరు గ్రూపులుగా విభజించి, ప్రతి గ్రూపులో నలుగురు దండేటట్లు చూసుకున్నాడు. వారి పని ఏమిటంటే, ఓ గ్రూపుకి ప్రశ్న అడిగినప్పుడు ముందు వారు సొంతంగా పరిష్కరించాలి. సమాధానం లభించని పక్షంలో తన ముందు కూర్చున్న గ్రూపు వారి దగ్గరకు వెళ్ళి జవాబు కోరాలి. అలాగే అందరూ తన ఎదుటి గ్రూపు వారి వద్దకు వెళ్ళి సమాధానం రాబట్టాలి. "మీకు తెలియకపోతే జ్ఞానం గలవారిని అడగండి" అన్న అల్లాహ్ ఆదేశం స్ఫూర్తితో ఈ పద్ధతిని ప్రవేశ పెట్టాడు అలీ.

"పూర్తి ప్రపంచంలో 2796 భాషలు మాట్లాడుతారు ప్రజలు. వాటిలో కొన్ని – ఆసియాలో 153, ఆఫ్రికాలో 118, రెండు ఆమెరికాల్లో 424, మిగతా ప్రాంతాల్లో 117 భాషలు. ఇలాంటివే కొన్ని మనకు తెలియని విషయాలు తెలుసుకోవడానికి ఈ ప్రశ్నలు–సమాధానల కార్యక్రమం ఏర్పాటు చేశాము" అని పరిచయ పలుకులు చెప్పాడు హమ్జా. పిల్లలూ మీరంతా రెడియేనా? ఓ...మేంమతా...రెడి! ప్రశ్నల పట్టిక ఇలా ఉంది:

- ప్రవక్తలందరిలో శ్రేష్ఠులైన ఐదుగురు ప్రవక్తల పేర్లు చెప్పండి?
- ప్రపంచంలో తొలి 'మందుల షాపు' స్థాపించింది ఎవరు?
- సూర్య కిరణాలు భూమి వరకు ఎన్ని నిమిషాల్లో చేరతాయి?
- నేర్చుకున్న విద్యను మరచిపోకుండా ఉండాలంటే ఏం చేయాలి?
- అల్లాహ్‌కు గల పవిత్ర పేర్లు ఎన్ని?
- చీమకు ఎన్ని కాళ్ళు ఉంటాయి?
- ఏ ప్రవక్తను చేప మింగేసింది?
- నిద్రపోయేటప్పుడు చదివే దుఆ ఏమిటి?
- చెరశాలలో బంధీ అయిన ప్రవక్త ఎవరు?
- ప్రపంచంలో మొదటిసారి గుర్కా విధానాన్ని ప్రవేశ పెట్టిందెవరు?
- మంచి కలను చూస్తే ఏం అనాలి?
- అగ్ని గుండంలో ఏ ప్రవక్తను పడవేశారు?
- తేనెటీగకు ఎన్ని కళ్ళుంటాయి?
- 'అన్బర్' అనే సుగంధ ద్రవ్యం దేంతో తీస్తారు?
- 'కలరా' ప్రవేశించని పట్టణం ఏది?
- ఏనుగు వేగమైనదా లేక ఒంటె వేగమైనదా?
- మంచి నీరు ఉప్ప నీరులో ఏది ముందు గడ్డ కడుతుంది?
- మస్జిద్‌లో ప్రవేశించే దుఆ చెప్పండి?
- ఖుర్‌ఆన్ గ్రంథం ఏ నెలలో అవతరించింది?
- ముగ్గురు దైవ దూతల పేర్లు చెప్పండి?



مسابقة سليمان صالح الرهيماني
لحفظ القرآن الكريم
تحت شعار
﴿وَلَقَدْ يَسَّرْنَا الْقُرْآنَ لِلذِّكْرِ فَهَلْ مِن مُّدَّكِرٍ﴾

న్యూ ముస్లింల, అరబ్బేతర ముస్లింల కొరకు
సులైమాన్ సాలెహ్ రుహైమానీ
10వ దివ్య ఖుర్ఆన్ కంఠస్థ పోటీలు

మొదటి గ్రూపు 15 ఏండ్లలోపు బాలలకు

1- ఒక పారా కంఠస్థ పోటీ: ⊙ మొదటి బహుమతి 80 KD
⊙ రెండవ బహుమతి 70 KD ⊙ మూడవ బహుమతి 60 KD

2- సగం పారా కంఠస్థ పోటీ: ⊙ మొదటి బహుమతి 60 KD
⊙ రెండవ బహుమతి 50 KD ⊙ మూడవ బహుమతి 40 KD

3- 13 సూరాల కంఠస్థ పోటీ: ⊙ మొదటి బహుమతి 50 KD
⊙ రెండవ బహుమతి 40 KD ⊙ మూడవ బహుమతి 30 KD
(ప్రతి బహుమతికి అర్హులు ఇద్దరు. ఒక బాలుడు ఒక బాలిక చొప్పున)

రెండవ గ్రూపు న్యూ ముస్లింలు

1- ఒక పారా కంఠస్థ పోటీ: (ఇస్లాం స్వీకరించి 5 ఏండ్లకు పైగా....)
2- 20 సూరాల కంఠస్థ పోటీ: (ఇస్లాం స్వీకరించి 3 నుండి 5 ఏండ్లు నిండినవారు)
3- 12 సూరాల కంఠస్థ పోటీ: (ఇస్లాం స్వీకరించి ఏడాది నుండి మూడేండ్లు)
4- 7 సూరాల కంఠస్థ పోటీ: (ఇస్లాం స్వీకరించి ఒక ఏడాది కాలం కూడా కానివారు)

గమనిక: ప్రతి పోటీ మొదటి బహుమతి 80 KD, రెండవ బహుమతి 70 KD, మూడవ బహుమతి 60 KD
(ప్రతి బహుమతికి అర్హులు 8 మంది 4గురు స్త్రీలు 4గురు పురుషులు

మూడవ గ్రూపు అరబ్బేతర ముస్లింలు

1- 5 పారాల కంఠస్థ పోటీ: ⊙ మొదటి బహుమతి 180 KD
⊙ రెండవ బహుమతి 170 KD ⊙ మూడవ బహుమతి 160 KD

2- 4 పారాల కంఠస్థ పోటీ: ⊙ మొదటి బహుమతి 140 KD
⊙ రెండవ బహుమతి 130 KD ⊙ మూడవ బహుమతి 120 KD

3- 3 పారా కంఠస్థ పోటీ: ⊙ మొదటి బహుమతి 100 KD
⊙ రెండవ బహుమతి 90 KD ⊙ మూడవ బహుమతి 80 KD

4- 2 పారా కంఠస్థ పోటీ: ⊙ మొదటి బహుమతి 60 KD
⊙ రెండవ బహుమతి 50 KD ⊙ మూడవ బహుమతి 40 KD

5- 1 పారా కంఠస్థ పోటీ: ⊙ మొదటి బహుమతి 40 KD
⊙ రెండవ బహుమతి 30 KD ⊙ మూడవ బహుమతి 20 KD

(ప్రతి బహుమతికి అర్హులు ఇద్దరు. ఒక స్త్రీ ఒక పురుషుడు చొప్పున)

నియమ నిబంధనలు

- ఈ పోటీలు న్యూ ముస్లింల కొరకు, అరబ్బేతర ముస్లింల కొరకు మాత్రమే ప్రత్యేకం.
- ఈ పోటీలలో స్త్రీలు, పరుషులు కూడా పాల్గొనవచ్చు. ఇరువురికి వేర్వేరు బహుమతులుంటాయి.
- పేర్లు నమోదు చేసే సమయంలో సివిల్ ఐడి తప్పకుండా సమర్పించాలి.
- క్రితం సారి పోటీలలో బహుమతులు గెల్చినవారు మళ్ళీ అదే విభాగంలోగానీ, దానికన్నా దిగువ స్థాయిలో గానీ పాల్గొనలేరు. ఎగువ స్థాయిలో మాత్రమే పాల్గొనవలసి ఉంటుంది.
- దరఖాస్తు ఫారాలు ఇవ్వవలసిన ఆఖరు తేది 10-08-2011
- ఈ పోటీ పరీక్షలు 11, 12, 13-08-2010 తేదీలలో జరుగుతాయి.
- బహుమతి ప్రదాన కార్యక్రమం వేరుగా జరుగుతుంది. ఈ తేదీ తరువాత ప్రకటించబడుతుంది.
- దరఖాస్తు ఫారంలో మీ మొబైల్ నెంబరును తప్పక నమోదు చేయాలి.

మీ పేర్లు నమోదు చేయవలసిన కేంద్రాలు

1) **ipc** కువైట్ సిటీ (పురుషులకు మాత్రమే) – 22444117 EXT:151
2) **ipc** జహ్రా బ్రాంచ్ (స్త్రీలు, పురుషులు కూడా) – 24558830/40
3) **ipc** ఖైతాన్ బ్రాంచ్ (స్త్రీలు, పురుషులు కూడా) – 24711141, 24735627
4) **ipc** రౌదా బ్రాంచ్ (స్త్రీలు మాత్రమే) – 22511301/5
5) **ipc** మన్‌గఫ్ బ్రాంచ్ (స్త్రీలు, పురుషులు కూడా) – 23921526
6) **kpcc**, ఫర్వానియా (స్త్రీలు, పురుషులు కూడా) – 24712574 EXT: 102
7) **ipc** వఫ్రా, అమ్‌గరా, సబాహియా బ్రాంచ్‌లు (స్త్రీలు, పురుషులు కూడా) వఫ్రా –23810308
8) **ipc** సాల్మియా – 25733263

పోటీలు నిర్వహించబడు కేంద్రాలు

IPC, కువైట్ సిటీ మస్జిద్ ముల్లా సాలిహ్, షార ఫహద్ సాలిమ్ (పురుషులకు మాత్రమే)
IPC రౌదా బ్రాంచ్ (స్త్రీలకు మాత్రమే)

మీరు పాల్గొనే విభాగాలు

15 ఏండ్లలోపు బాలలైతే: ఏ విభాగంలో పాల్గొంటారో టిక్ చేయండి.
లెవెల్ – 1 ☐ లెవెల్ – 2 ☐ లెవెల్ – 3 ☐

న్యూ ముస్లింలు

లెవెల్ – 1 ☐ లెవెల్ – 2 ☐ లెవెల్ – 3 ☐ లెవెల్ – 4 ☐

అరబ్బేతర ముస్లింలు

లెవెల్ – 1 ☐ లెవెల్ – 2 ☐ లెవెల్ – 3 ☐ లెవెల్ – 4 ☐ లెవెల్ – 5 ☐

దరఖాస్తు ఫారం

1) పూర్తి పేరు: .....
2) కువైట్ సివిల్ ఐడి నెంబరు: .....
3) లింగం : పురుషుడు ☐ స్త్రీ ☐
4) ముస్లిం ☐ న్యూ ముస్లిం ☐ ముస్లిం న్యూ ముస్లిం బాలలు ☐
4) నేషనాలిటీ : .....
5) టెలిఫోన్ : .....
6) గత ఏడాది పోటీలలో పాల్గొన్నారా? అవును ☐ లేదు ☐
7) ఒకవేళ పాల్గొని ఉంటే ఏ గ్రూపులో పాల్గొన్నారు? ☐



ఈ పోటీలు వివిధ భాషల్లో నిర్వహించబడుతున్నాయి:

తెలుగు, తమిళ్, మళయాలం, సింగళం, ఫిలిప్పీనీ,
హిందీ, చైనా, నేపాలీ, ఉర్దూ.

ముస్లిమేతరుల విభాగం

మొదటి బహుమతి : **60 దీనార్లు**

రెండవ బహుమతి : **50 దీనార్లు**

మూడవ బహుమతి : **40 దీనార్లు**

గమనిక: గమనిక: జవాబు పత్రాలు 15-09-2011 తేదీ వరకు ఇచ్చేయ్యాలి. బహుమతులు 28-09-2011 తేదీన ఇవ్వబడతాయి. ప్రతి భాషకు చెందిన ఆరుగురిని ఎంపిక చేయడం జరుగుతుంది. అలాగే సమాధానాలు వ్రాసిన మీదట సమీప ఐపిసి బ్రాంచీలో జమా చేయాలి.

న్యూ ముస్లింల విభాగం

మొదటి బహుమతి : **60 దీనార్లు**

రెండవ బహుమతి : **50 దీనార్లు**

మూడవ బహుమతి : **40 దీనార్లు**

గమనిక: జవాబు పత్రాలు 15-09-2011 తేదీ వరకు ఇచ్చేయ్యాలి. బహుమతులు 28-09-2011 తేదీన ఇవ్వబడతాయి. ప్రతి భాషకు చెందిన ఆరుగురిని ఎంపిక చేయడం జరుగుతుంది. అలాగే సమాధానాలు వ్రాసిన మీదట సమీప ఐపిసి బ్రాంచీలో జమా చేయాలి.

IMA ఆధ్వర్యంలో 'మేరాజ్ సందేశం'









IMA (ఇండియన్ ముస్లిం అసోసియేషన్) ఆధ్వర్యంలో గురువారం 30-01-2011 తేదీన మేరాజ్ (గగన యాత్ర) శుభ సందర్భాన్ని పురస్కరించుకొని మాలియాలోని యూసుఫ్ అల్ అద్సానీ మస్జిద్‌లో ఓ కార్యక్రమం నిర్వహించబడింది. సోదరులు మహ్తూబుద్దీన్ ఖుర్‌ఆన్ పారాయణంతో ప్రారంభమయిన ఈ కార్యక్రమంలో **IMA** అధ్యక్షులు జనాబ్ ముహమ్మద్ అస్లం గారు ప్రారంభ పలుకులు చెప్పగా, బ్రదర్ నిసార్ అహ్మద్ గారు **'నమాజు ఔన్నత్యం'** అన్న అంశంపై ప్రసంగించగా, హాఫిజ్ హఫీజుద్దీన్ గారు **'మేరాజ్ సందేశం'** అన్న అంశంపై ఉపన్యాసం ఇచ్చారు. పూర్తి ఈ కార్య క్రమానికి సోదరులు అబుల్ ఆలా షాహీన్ గారు అధ్యక్షులు గా వ్యవహరించారు.

రమజాను పోటీలు

(ముస్లిమేతర సోదరులకు ప్రత్యేకం)

క్రింది నివేదికలు ఎవరెవరివో కనుక్కోండి

ప్రశ్న: "ప్రపంచంలో 12 శతాబ్దులుగా ఏ మాత్రం మారకుండా స్వచ్ఛంగా నిలిచిన గ్రంథం ఇది-ఖుర్‌ఆన్ తప్ప మరొకటి లేదు" అని చెప్పిన దురుసయిన ఇస్లాం విమర్శకుడు ఎవడు?

జ:

ప్రశ్న: "ప్రజాస్వామిక వ్యవస్థను ఆదేశించడమేకాక ఆచరించి చూపిన తొలి ధర్మం అదే-ఇస్లాం. మస్జిద్‌లో అజాన్ పలకగానే ఆరాధకులందరూ వచ్చి చేరినప్పుడు, రైతూ రాజు ప్రక్కప్రక్కనే దైవ సమక్షంలో మోకరిల్లి 'దేవుడే గ్పొవాడు' (అల్లాహు అక్బర్) అని ప్రకటించినప్పుడు ఇస్లాంలోని ప్రజాస్వామిక విధానం ప్రజల్లో రోజుకు అయిదుసార్లు మూర్తీభవించి దర్శనమిస్తుంది" అని ప్రతిపాదించిన ప్రముఖ భారతీయ కవయిత్రి ఎవరు?

జ:

ప్రశ్న: "మనిషిలో సహజంగానే అంతర్లీనమై ఉన్న పాపరాహిత్యాన్ని గురించి ఇస్లాం ప్రబోధిస్తుంది. దాని బోధనల ప్రకారం స్త్రీపురుషులిరువురూ ఒకే మూలం నుంచి ఆవిర్భవించారు. ఇద్దరిలో ఉన్నది ఒకే ఆత్మ. ఇద్దరూ బుద్ధీజ్ఞానాలు, ఆధ్యాత్మికతా నైతిక తలకు సంబంధించిన సమానమయిన శక్తి సామర్థ్యాలు కలిగి ఉన్నారు" అని స్టేట్‌మెంట్ ఇచ్చిన ప్రముఖ వ్యక్తి ఎవరు?

జ:

ప్రశ్న: "ఇస్లాం రెండు విరుద్ధమయిన అతిశయాల మధ్య సంతుల నాన్ని ఏర్పరుస్తుంది. ఇంకా నాగరికతకు పునాది కాగల శీల నిర్మాణాన్ని దృష్టిలో ఉంచుకుంటుంది" అని చెప్పిన వ్యక్తి ఎవరు?

జ:

ప్రశ్న: "ముహమ్మద్ సమస్త ప్రవక్తల్లోనూ, ధార్మిక వ్యక్తిత్వాల్లోనూ అత్యంత విజయవంతులైన వారు" అని నివేదిక ఇచ్చిన పాశ్చాత్య గ్రంథం పేరేమిటి?

జ:

ప్రశ్న: "ఇది ఎంతో వింతైన విషయం. ఓ రాజ్యానికి అధిపతి గాను, ధర్మ పీఠానికి అధిపతిగాను, ఆయన తనలోనే ఓ సీజరు. ఓ పోపు అని చెప్పవచ్చు. ఆయన పోపే కానీ; పోపులాంటి పటాటోపం లేదు. ఆయన సీజరే కానీ; సీజర్ లాంటి వైభవం లేదు. స్థాయి సైన్యం లేదు. అంగరక్షకుడు లేడు. రక్షకభట దళమూ లేదు. ఖజానా లేదు. ప్రపంచంలో ఎవరైనా నిజమయిన దైవిక అధికారంతో పరిపాలించారని చెబితే అది ముహమ్మద్ మాత్రమే. ఆయనకు అన్ని అధికారాలూ ఉండేవి. కాని ఆ అధికారాలకు ఆలంబనలేవీ ఉండేవి కావు. ఆయన అధికార దంబాచారాలను ఖాతరు చెయ్యలేదు. ఆయన వ్యక్తిగత జీవితంలోని నిరాడంబరత ఆయన ప్రజా జీవితంలోని సాధారణతను ప్రతిబింబిస్తూ ఉండేది" అని నివేదించిన వ్యక్తి ఎవరు?

జ:

ప్రశ్న: "మన విజ్ఞాన శాస్త్రం విభ్రాంతి గొలిపే ఆవిష్కరణల వల్ల, విప్లవకరమయిన సిద్ధాంతాల వల్ల మాత్రమే అరబ్బులకు రుణ పడి లేదు. విజ్ఞాన శాస్త్రం అరబ్బు సంస్కృతికన్నా అసలు తన ఉనికికే రుణపడి ఉంది" అని చెప్పిందెవరు?

జ:

ప్రశ్న: "ఇదే ఇస్లాం అంటేనూ - మనం దైవానికి స్వయం సమర్పణ చేసుకోవాలి. మన శక్తి అంతా ఆయన సమక్షంలో సంపూర్ణంగా మనల్ని మనం అర్పించుకోవడంలోనే దాగి ఉంది" అని ప్రతిపాదించిందెవరు?

జ:

ప్రశ్న: "ఇస్లాం ప్రబోధించే ఈ అభేద్యమయిన ఏకతను చూసి అనేకమార్లు ప్రభావితురాలినయ్యాను. దీని ద్వారా మనుషులు అంతర్ప్రేరణారీత్యానే సోదరులుగా రూపొందుతారు" అని అభిప్రాయపడిందెవరు?

జ:

ప్రశ్న: "ముహమ్మద్ జీవితంలో ఎదురయిన గొప్ప విజయం కేవలం నైతిక బలం ద్వారా మాత్రమే సాధ్యమయింది - కత్తి దెబ్బ ఒక్కటీ లేదు" అని చెప్పిందెవరు?

జ:

క్రింది ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పండి

ప్రశ్న: "నేడు మీపై ఎలాంటి నింద, ప్రతీకారం లేదు. వెళ్ళండి మీ అందరికి నేడు విముక్తినిచ్చాము" అని ఎవరు చెప్పారు? ఏ సందర్భంలో చెప్పారు?

జ:

ప్రశ్న: దైవ అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) వారి మరణ ఘడియల్లో ఆయన ఎట్టి దుస్తుల్ని తొడిగి ఉన్నారు?

జ:

ప్రశ్న:"ఇదే దైవం మనకై-భూవాసులమయిన మనకై పంపిన అత్యున్నతమయిన విజ్ఞత" ఈ మాటను క్లాయిల్ ఏ సందర్భంగా చెప్పాడు?

జ:

ప్రశ్న: 'అల్ అమీన్ - విశ్వసనీయుడు', 'అస్సాదిఖ్ - సత్య సంధుడు' అన్న బిరుదులు ఇస్లామీయ చరిత్రలో ఎవరికి సంబంధించినవి?

జ:

మీ వివరాలు

పూర్తి పేరు:

.....

బతాఖా నెంబరు:

.....

☎ టెలిఫోన్ నెంబరు:

.....

రమజాను పోటీలు

(న్యూ ముస్లింలకు ప్రత్యేకం)

ఈ క్రింది ప్రశ్నలకు సరైన సమాధానం మీద టిక్ (✓) చేయండి.

1) భూ మండలంపై తొలి సారి బహుదైవారధనకు దారి తీసిన కారణం ఏమిటి?

⊙పుణ్యాత్ముల విషయంలో అతిశయిల్లడం
⊙అజ్ఞానం సర్వ వ్యాప్తమయి ఉండటం
⊙పూర్వీకుల అంధానుసరణ

2) దైవ ప్రవక్త (స) మహిమల్లో అత్యంత ఘనతరమైన మహిమ ఏది?

⊙దివ్య ఖుర్ఆన్ ⊙చంద్ర ఖండనం
⊙చేతి వేళ్ళ మధ్య నుండి నీళ్ళు రావడం

3) 'గసీలుల్ మలాయిక' – దైవదూతలు స్నానం చేయు పించిన వ్యక్తి అని బిరుదు పొందిన సహాబీ ఎవరు?

⊙ఖాలిద్ బిన్ వలీద్ (ర) ⊙హన్‌జలా బిన్ అబీ ఆమిర్ (ర)
⊙హమ్జా బిన్ అబ్దుల్ ముత్తలిబ్ (ర)

4) ప్రవక్తల పితామహుడు అని ఎవరి పిలుస్తారు?

⊙ప్రవక్త ముసా (అ) ⊙ప్రవక్త ఇబ్రాహీమ్ (అ)
⊙ప్రవక్త యాఖూబ్ (అ)

5) ప్రవక్త (స) వారి మరణానంతరం పరమపదించిన ఆయన మొదటి సతీమణి ఎవరు?

⊙హజ్రత్ ఆయిషా (ర) ⊙హజ్రత్ ఖదీజా (ర)
⊙హజ్రత్ జైనబ్ బిన్త్ జహష్ (ర)

6) అల్లాహ్ తన అస్థిత్వం రీత్యా ఎక్కడున్నాడు?

⊙హృదయంలో ⊙అర్ష్ మీద
⊙ప్రతి చోట

7) స్వర్గంలో మొదట ఎవరు ప్రవేశిస్తారు?

⊙ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) ⊙ప్రవక్త ఆదమ్ (అ)
⊙ప్రవక్త మహమ్మద్ (స)

8) ఇస్లాంలో వీర మరణం పొందిన తొలి మహిళ ఎవరు?

⊙రబీయా బిన్త్ అయ్యూబ్ (ర) ⊙సుమయ్యా ఉమ్ అమ్మార్
⊙ఉమయ్యా బిన్త్ నజ్జార్ (ర)

9) ఎన్ని అవయవాలపై సజ్దా చేయమని ఆదేశించబడింది?

⊙ 3 ⊙ 7 ⊙ 5

10) ఖుర్ఆన్‌లో పేరుతో సహా ప్రస్తావించబడిన ఏకైక మహిళ ఎవరు?

⊙ప్రవక్త లూత్ (అ) గారి భార్య
⊙ఫిర్‌ఔన్ భార్య
⊙ప్రవక్త ఈసా (అ) గారి తల్లి మర్యం

క్రింది సమాధానాలు కరెక్టా (✓) కాదా (☒) తెలుపండి.

1) ఇస్లాం స్వీకరించిన తొలి మహిళ హజ్రత్ ఖదీజా (ర) ( )

2) ఖుర్ఆన్ అర్థపరంగానూ, పద పరంగానూ అల్లాహ్ వాక్యమే ( )

3) అర్కానుల్ ఈమాన్‌లోని అన్నింటిని విశ్వసించి కేవలం దైవ ప్రవక్తల పట్ల నమ్మకం లేని వ్యక్తి ముస్లిం అనబడతాడు. ( )

4) పవిత్ర ఖుర్ఆన్ అవతరణ 23 సంవత్సరాల వ్యవధిలో జరిగింది ( )

5) స్వర్గపు బీగం చెవి నమాజు ( )

క్రింద ఇవ్వబడిన హదీసులను అక్కడే ఇవ్వబడిన పదాలతో పూర్తి చేయండి

1) సహరీ చేయండి. నిశ్చయంగా సహరీ చేయడంలో.....

(శక్తి ఉంది – శుభం ఉంది– సహాయం ఉంది)

2) ఒక ముస్లిం మరో ముస్లింతో మూడు రోజులకు మించి మాట్లాడకుండా ఉండరాదు. వారిలో ఉత్తముడు మొదట..... (గిఫ్ట్ ఇచ్చేవాడు – నగుమోము తో పలుకరించేవాడు – సలాం చేసేవాడు)

3)అల్లాహ్ మా ప్రభువు, ఇస్లాం మా జీవన విధానం, ముహమ్మద్ (స) మా ప్రవక్త అన్న విషయంలో నేను సంతృప్తుడనై ఉన్నాను అని చెప్పిన వ్యక్తి..... ....

(స్వర్గంలో ప్రవేశించి తీరతాడు – అతని విశ్వాసం నిజమౌతుంది – అతను ముస్లిం అనబడతాడు)

క్రింది ప్రశ్నలకు సమాధానం ఇవ్వండి

1) మనిషిని ఇస్లాం నుండి బహిష్కరించే రెండుకారణాల్ని పేర్కొనండి.

జ:

2) అల్లాహ్ ఒక్కడే నిజ ఆరాధ్యుడు అని విశ్వసించడం వల్ల కలిగే రెండు లాభాల్ని పేర్కొనండి.

జ:

మీ వివరాలు

పూర్తి పేరు: .....

బతాఖా నెంబరు: .....

☎టెలిఫోన్ నెంబరు:.....





వివేచన

దురాలోచనలకు దూరంగా...!





మానవుడి మనసులో అప్పుడప్పుడు చాలా నీచమైన, ప్రమాదకరమైన ఆలోచనలు వస్తుంటాయి. ఒక్కోసారి తిరస్కార భావాలు, నాస్తిక ఆలోచనలు, అభ్యంతరాలు మనో మస్తిష్కాలను కలవర పెడుతూ ఉంటాయి. అయితే ఇలాంటి ఆలోచనలు, అనుమానాలు కేవలం ఆలోచనలకే పరిమితమై ఉన్నంత వరకు అల్లాహ్ కూడా వాటిని గురించి ప్రశ్నించడు. అయితే ఇవే ఆలోచనలు, అనుమానాలు పరిధులు దాటి ఆచరణలుగా రూపొందితే మాత్రం వాటిని గురించి ప్రశ్నించడం, లెక్క తీసుకోవడం జరుగుతుంది.

ధర్మం, ధర్మశాస్త్రానికి వ్యతిరేకంగా వచ్చే ఆలోచనలు మనిషిని కలవర పెడుతూ, వాటిని నోటితో పలకడానికే అతని మనసు ఒప్పుకోనంతటి స్థితికి అతను చేరుకుంటే ఇది నిజంగానే స్వచ్ఛమైన ఈమాన్ స్థితికి తార్కాణం. దాదాపు ఈ రకమైన నటువంటి ప్రశ్నలు, అనుమానాలు షైతాన్ తరఫు నుండే ఉద్భవిస్తాయి. ఎవరి మనసులోనైనా షైతాన్ ఇటువంటి అజ్ఞానపు, అహంభావపు ఆలోచనలను రేకెత్తించినట్లయితే, షైతాన్ కీడు నుండి అల్లాహ్ శరణు కోరుతూ, ఆలోచనలను అటు నుండి మళ్ళించు కోవడమే సరైన చికిత్స. అలాగే మన మనసు చెడు ఆలోచనలను స్వీకరించడం లేదంటే అల్లాహ్ ప్రత్యేక కృపాకటాక్షాలు మన మీద ఉన్నాయని తెలుసుకోవాలి. హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ కథనం –

ఒక వ్యక్తి దైవ ప్రవక్త (స) వారి పవిత్ర సన్నిధికి వచ్చి ఇలా విన్నవించుకున్నాడు: **“ ఒక్కోసారి నా మనసులో ఎలాంటి చెడు ఆలోచనలు వస్తున్నాయంటే, వాటిని నా నోటితో చెప్పడం కంటే, కాలి బొగ్గయి పోవడమే మేలనిపిస్తుంది’ అని. అప్పుడు ప్రవక్త (స) - “ఈ వ్యవహారాన్ని శంక (అనుమానం) వైపు మళ్ళించిన అల్లాహ్‌కు మాత్రమే సకల స్తోత్రాలు, కృతజ్ఞతలు” అని సెలవిచ్చారు. (అబూ దావూద్)**

“మరో హదీసులో దైవ ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారు: మహోన్నత ప్రభువైన అల్లాహ్ నా సముదాయం మనసులోని దురాలోచనలు, శంకలను క్షమించేశాడు. వాటిని ఆచరించనంత వరకు, నోటితో పలకనంత వరకూ వాటిని గురించి ప్రశ్నించడం కూడా జరగదు”. (బుఖారీ, ముస్లిం)



రమజాన్ హోటల్లో పాల్గొనండి
విలువైన బహుమతులు గెలుచుకోండి

నెలవంక మాస పత్రికను క్రింది సైట్‌లలో చూడగలరు.
http://ipcblogger.net/salam/
http://www.scribd.com/syedabdus

http://www.facebook.com/profile.php?id=100001212309707

ఇఫ్తార్ విందు / ఆధ్యాత్మిక ఉపన్యాసాలు
ఐపిసి మంగఫ్ బ్రాంచ్ తరఫు నుండి (ఐపిసి ప్రక్కనున్న ప్రత్యేకమైన ఖీమాలో) సుల్తాన్ సెంటర్ మంగఫ్ ఎదురుగా ప్రతి రోజూ, అందరి కోసం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయబడింది. ఇఫ్తార్‌కి ముందు తెలుగు, ఉర్దూ మరియు ఇతర భాషలలో ఆధ్యాత్మిక ఉపన్యాసాలూ ఉంటాయి. ఆసక్తి గలవారిని ఐపిసి మంగఫ్ బ్రాంచ్ ఆహ్వానిస్తున్నది. వివరాల కోసం సంప్రదించండి: **97258148**

రమజాన్ మర్యాదలు
ఉషోదయానికి ముందు చివరి సమయంలో సహరీ భుజించటం, సూర్యాస్తమయం జరిగిన వెంటనే ఇఫ్తార్ చేయటం.
వీలైనంత ఎక్కువగా దానధర్మాలు చేయటం.
తరావీహ్ నమాజులో పాల్గొనటం.
కనీసం ఒక్కసారైనా పూర్తి ఖుర్‌ఆన్ పూర్తిగా చదవటం.
ఏతికాఫ్ పాటించటం.
లైలతుల్ ఖద్ర్ అన్వేషణలో చివరి పది రోజులు పరిశ్రమించటం.
అశ్లీల విషయాలు, అసభ్య కార్యకలాపాల జోలికి పోకుండా ఉండటం.

ఇషా	మగ్రిబ్	అస్ర్	జుహర్	సూర్యోదయం	షుక్ర్	సహరీ	రమజాన్ 1432	ఆగస్టు 2011	
7.50	6.28	3.28	11.52	5.16	3.51	3.41	16	16	మంగళ
7.49	6.27	3.27	11.52	5.17	3.52	3.42	17	17	బుధ
7.48	6.26	3.27	11.52	5.18	3.53	3.43	18	18	గురు
7.47	6.25	3.27	11.52	5.18	3.54	3.44	19	19	శుక్ర
7.45	6.24	3.27	11.51	5.19	3.54	3.44	20	20	శని
7.44	6.23	3.26	11.51	5.19	3.55	3.45	21	21	ఆది
7.43	6.22	3.26	11.51	5.20	3.56	3.46	22	22	సోమ
7.42	6.21	3.25	11.51	5.20	3.57	3.47	23	23	మంగళ
7.40	6.20	3.25	11.51	5.21	3.57	3.47	24	24	బుధ
7.39	6.18	3.24	11.51	5.21	3.58	3.48	25	25	గురు
7.38	6.17	3.24	11.50	5.22	3.59	3.49	26	26	శుక్ర
7.36	6.16	3.23	11.50	5.22	4.00	3.50	27	27	శని
7.35	6.15	3.23	11.49	5.23	4.00	3.50	28	28	ఆది
7.34	6.14	3.23	11.49	5.24	4.00	3.50	29	29	సోమ

ఇషా	మగ్రిబ్	అస్ర్	జుహర్	సూర్యోదయం	షుక్ర్	సహరీ	రమజాన్ 1432	ఆగస్టు 2011	
8.06	6.40	3.30	11.54	5.08	3.39	3.29	1	1	సోమ
8.05	6.40	3.30	11.54	5.08	3.40	3.30	2	2	మంగళ
8.04	6.39	3.30	11.54	5.09	3.41	3.31	3	3	బుధ
8.03	6.38	3.30	11.54	5.10	3.41	3.31	4	4	గురు
8.02	6.37	3.30	11.54	5.10	3.42	3.32	5	5	శుక్ర
8.01	6.37	3.30	11.54	5.11	3.43	3.33	6	6	శని
8.00	6.36	3.29	11.54	5.11	3.44	3.34	7	7	ఆది
7.59	6.35	3.29	11.54	5.12	3.45	3.35	8	8	సోమ
7.58	6.34	3.29	11.54	5.12	3.46	3.36	9	9	మంగళ
7.57	6.33	3.29	11.53	5.13	3.46	3.36	10	10	బుధ
7.56	6.32	3.29	11.53	5.14	3.47	3.37	11	11	గురు
7.55	6.32	3.29	11.53	5.14	3.48	3.38	12	12	శుక్ర
7.54	6.31	3.28	11.53	5.15	3.49	3.39	13	13	శని
7.53	6.30	3.28	11.53	5.15	3.50	3.40	14	14	ఆది
7.51	6.29	3.28	11.53	5.16	3.50	3.40	15	15	సోమ

ఉపవాస మహత్యం
ఎవరైతే రమజాను సాంతం ఉపవాసాలు పాటిస్తారో వారి గత పాపాలన్నీ మన్నించబడతాయి. ఉపవాసి చేసే ప్రార్థన తిరస్కరించ బడదు.
ఉపవాసి నోటి దుర్వాసన దైవ దగ్గర కస్తూరి సువాసన కంటే ఎంతో మేలైనదై ఉంటుంది.
ఉపవాసి కూర్చో వడం, పడుకోవడం, మౌనం అంతా (చెడుకి పాల్పడనంత వరకూ) ప్రార్థనగానే పరిగణించ బడుతుంది.
ఉపవాసికి ఇఫ్తార్ చేయిపించిన వ్యక్తి ఉపవాసికి లబించేంతటి పుణ్యం లభిస్తుంది.
ఉపవాసి స్వర్గంలో ప్రవేశించేందుకు రయ్యాన్ అనబడే ఒక ప్రత్యేక ద్వారం ఉంటుంది.
ఉపవాసి ప్రతిఫలాన్ని స్వయం అల్లాహ్ ప్రసాదిస్తాడు.

లైలతుల్ ఖద్ర్ ప్రార్థన
"అల్లాహుమ్మ ఇన్నక అఫువ్వున్ తుహిబ్బుల్ అఫ్‌వ ఫఅఫు అన్నీ"
అనువాదం: ఓ అల్లాహ్! నీవు క్షమించే వాడవు. క్షమాగుణాన్ని ఇష్టపడతావు. కనుక నన్ను క్షమించు.

పవిత్ర రమజాన్ శుభాకాంక్షలు!